www.udyamakeratam.com
PRGI No. : TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 113 | 11-10-2026 | ఆదివారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

ఢిల్లీలో నిరసనల సెగ

మమతా బెనర్జీ, కేజ్రీవాల్, పినరయి విజయన్ అదుపులోకి... అగ్రనేతల అరెస్టులతో ఉద్రిక్తత!

- ప్రతిపక్ష నేతలను బస్సుల్లో తరలించిన పోలీసులు
- 24 గంటల్లో విడుదల చేయకుంటే నిరాహారదీక్ష చేస్తానన్న వాంగ్‌చుక్
- ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామా డిమాండ్‌తో ఆందోళనలు

4

దేశ రాజధాని ఢి ల్లీ నిరసనలతో అట్టుడికింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.

విమానం దిగకముందే అదుపులోకి..

దీప్కేను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వివరాలు 4లో..

వెనక్కి తగ్గేది లేదు!

లోక్ సభ విపక్ష నేత రాహుల్ గాంధీ

రాబోయే 8 నెలలు

కీలకం

"రాబోయే ఎనిమిది నెలలు మన రాష్ట్రానికి అత్యంత గడ్డుకాలం. ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరువు పరిస్థితులు పొంచి ఉన్నాయి. ఒకవైపు వర్షాభావం, మరోవైపు ఎంత ఖర్చు పెట్టి కరెంటు కొనదామన్నా మార్కెట్లో దొరకని దారుణ పరిస్థితి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా భవిష్యత్తులో తీవ్ర మూల్యం చెల్లించుకోక తప్పదు. ఏ ఒక్క చుక్క నీరు వృథా కావొద్దు.. విద్యుత్‌ను అత్యంత పొదుపుగా వాడుకోవాలి. విపత్తును ఎదుర్కొనేందుకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ అమలు చేయాల్సిందే.." అంటూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

- కరువు కోరల్లో 215 మండలాలు!
- విద్యుత్, నీటి పొదుపుపై తక్షణ దృష్టి పెట్టాలి
- కేంద్రం నుంచి రూ. 20 వేల కోట్ల ప్యాకేజీ సాధించాలి

ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): ఎల్ నినో పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్ నినో మరియు వర్షాభావ పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సందర్భంగా ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని ముఖ్యమంత్రి

మిగతా 2 లో

దిల్లీలో కదం తొక్కండి!

2

12న ఏఐసీసీ నిరసనల్లో పాల్గొనాలని సీఎం రేవంత్ పిలుపు

అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు

- రవీంద్రభారతి, పబ్లిక్ గార్డెన్‌లో ఎంగిలిపూల వేడుకలు
- పాల్గొన్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్
- మహిళలతో కలిసి ఆడిపాడిన అమాత్యులు

..వివరాలు 3లో

తీరొక్క పూలన్నీ ఒకచోట చేరినట్లు.. తెలంగాణ సంస్కృతికి నిలువెత్తు అద్దం పడుతూ బతుకమ్మ పండుగ ఘనంగా మొదలైంది. రంగురంగుల పూలను అందంగా పేర్చి, పట్టుబట్టలు ధరించిన మహిళల ఆటపాటలతో హైదరాబాద్ నగరంతో పాటు విదేశీ గడ్డపైనా అద్భుతమైన సందడి నెలకొంది.

విదేశాల్లో దేశ పరువు తీస్తారా?

భారత ఆర్థిక వ్యవస్థపై ప్రతిపక్షాల వ్యాఖ్యలను తిప్పికొట్టిన కిషన్ రెడ్డి

2

2

కన్నీళ్లు తుడిచిన కేటీఆర్!

ఆడబిడ్డల భవిష్యత్తుకు రూ.10 లక్షల ఆర్థిక సాయం

మానుకోట ఉద్యమకారుడు జనార్ధన్ మృతి

పెద్దముప్పారంలో రోడ్డునపడ్డ నిరుపేద కుటుంబం

ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

కాంగ్రెస్ ఆరోపణలు అబద్ధం

3

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

నువ్వు బతికే ఉన్నావా..

పురుగుల మందు తాగి చావలేదా?'

- బాధితుడైన రైతుపై గజ్వేల్ తహసీల్దార్ అనుచిత వ్యాఖ్యలు!
- రైతు గోడు వినాల్సిన అధికారి.. చావు మాటలతో వెటకారం!
- భూ సమస్య పరిష్కారం కోసం తిరుగుతున్న అన్నదాతకు అవమానం

3

గజ్వేల్ తహసీల్దార్ తీరుపై తీవ్ర విమర్శలు

క్రీడాభివృద్ధికి పెద్దపీట

గోల్ఫ్ లీగ్ ముగింపు వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి

"రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియాన్ని నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారు.." అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

3

ఎంఎస్ఎంఈలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తాం

మంత్రి శ్రీధర్‌బాబు

'రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసేందుకు త్వరలో ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయబోతున్నాం. " అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

2

ఉద్యమ కెరటం
ఆదివారం 11 అక్టోబర్ 2026

దిల్లీలో కదం తొక్కండి!

12న ఏఐసీసీ నిరసనల్లో పాల్గొనాలని సీఎం రేవంత్ పిలుపు

ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలపై కాంగ్రెస్ ఫైర్

సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్

ఢిల్లీకి తరలిరావాలని పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): "ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ అధిష్టానం దిల్లీ వేదికగా సాగిస్తున్న పోరాటానికి మనమంతా అండగా నిలవాలి. లక్షలాది ఓట్లను అక్రమంగా తొలగించిన తీరుపై గళమెత్తాలి. ఈనెల 12వ తేదీన జరిగే నిరసన కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులంతా విధిగా పాల్గొనాలి.." అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నాయకులకు పిలుపునిచ్చారు. ఏఐసీసీ (ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ) ఆధ్వర్యంలో దిల్లీలో జరగనున్న ఈ కార్యక్రమాలకు తరలిరావాలని ఆయన కోరారు. ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భారీగా అక్రమాలు జరిగాయని మరియు అర్హులైన లక్షలాది మంది ఓట్లను అన్యాయంగా తొలగించారని ఆరోపిస్తూ ఇండి కూటమి పక్షాలు దిల్లీలో ఇప్పటికే నిరసనలు చేపడుతున్న విషయం విదితమే. ఈ అక్రమాలపై కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ మరియు మల్లికార్జున ఖర్గేల నేతృత్వంలో దిల్లీలో తీవ్రస్థాయిలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మరియు వివాదాస్పదమైన ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్లతో ఈ నిరసనలు ఉధృతంగా సాగుతున్నాయి. ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని మరియు ప్రజల ఓటు హక్కును కాలరాస్తోందని కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా మండిపడుతోంది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అధిష్టానం సాగిస్తున్న ఈ పోరాటంలో సంఘీభావం తెలపడానికి దిల్లీ వేదికగా నిర్వహించే నిరసన ప్రదర్శనలో పాల్గొనడానికి రాష్ట్రం నుంచి భారీగా తరలిరావాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ ముఖ్యమైన ఆందోళన కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. వారితో పాటు వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ జిల్లా కమిటీల అధ్యక్షులు మరియు టీపీసీసీ ముఖ్య నాయకులు అందరూ ఈనెల 12వ తేదీన దిల్లీకి చేరుకుని నిరసనను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

విదేశాల్లో దేశ పరువు తీస్తారా?

భారత ఆర్థిక వ్యవస్థపై ప్రతిపక్షాల వ్యాఖ్యలను తిప్పికొట్టిన కిషన్ రెడ్డి

ఎంఎస్ఎంఈల ద్వారా 40 కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి

2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో చిన్న పరిశ్రమలదే కీలకపాత్ర

హైదరాబాద్‌లో ఘనంగా లఘు ఉద్యోగ్ భారతి కాంక్లేవ్

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): "ప్రపంచమంతా భారత ఆర్థిక వ్యవస్థను వేనోళ్ల పొగుడుతుంటే.. కొందరు ప్రతిపక్ష నేతలు మాత్రం విదేశీ వేదికలెక్కి మన ఇండియన్ ఎకానమీ డెడ్ అంటూ దేశ పరువు తీస్తున్నారు. రాజకీయ స్వార్థం కోసం విదేశీ పెట్టుబడులను అడ్డుకుంటూ యువత ఉపాధి అవకాశాలను పణంగా పెడుతున్నారు. దేశాభివృద్ధిలో, ముఖ్యంగా 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలే (ఎంఎస్ఎంఈ) అత్యంత కీలకమైన ఇంజిన్‌గా వ్యవహరిస్తాయి.." అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 'లఘు ఉద్యోగ్ భారతి ఉ సౌత్ ఇండియా కాంక్లేవ్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేవలం పెద్ద పరిశ్రమల ద్వారానే కాకుండా గ్రామాలు, పట్టణాలు, పారిశ్రామిక ప్రాంతాల్లోని ఎంఎస్ఎంఈలు బలోపేతమైనప్పుడే దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి తేల్చిచెప్పారు. ఎంఎస్ఎంఈలు దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన వివరించారు. దేశ జీడీపీలో 32 శాతం, తయారీ రంగ ఉత్పత్తిలో 36 శాతం, ఎగుమతుల్లో ఏకంగా 49 శాతం వాటా ఈ చిన్న పరిశ్రమలదేనని ఆయన వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఉద్యమ' ప్లాట్‌ఫాంపై ఇప్పటికే దాదాపు 9.80 కోట్ల ఎంఎస్ఎంఈలు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఇవి దేశవ్యాప్తంగా 40 కోట్లకుపైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నాయని, ఇందులో 37 శాతం సంస్థలు మహిళల యాజమాన్యంలోనే నడవడం అత్యంత విశేషమని ప్రశంసించారు.

అండగా కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈల ఎదుగుదలకు అన్ని విధాలా అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తోందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. స్టార్టప్‌లకు త్వరితగతిన అనుమతులు ఇవ్వడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు అమలు చేయడం ద్వారా పారిశ్రామికవేత్తలకు అండగా నిలుస్తోందన్నారు. క్రెడిట్ గ్యారంటీ ఫండ్, పీఎం విశ్వకర్మ, ముద్ర, గవర్నమెంట్ ఇ-మార్కెట్ ప్లేస్ (జీఈఎం) వంటి అనేక అద్భుతమైన పథకాల ద్వారా ఆర్థిక సాయం, రుణ సదుపాయాలను విస్తృతంగా అందిస్తున్నట్లు వివరించారు. ఎంఎస్ఎంఈలకు అవసరమైన ఫైనాన్స్ అందించేందుకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఉత్పత్తి రంగానికి దక్షిణ భారతదేశం ఓ అద్భుతమైన హబ్‌గా రూపుదిద్దుకుందని మంత్రి కొనియాడారు. దక్షిణ భారతదేశం ఆటోమొబైల్, ఫార్మా, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు, సాంకేతిక ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే ప్రముఖ సెల్ ఫోన్ తయారీ కేంద్రంగా మారిందని, అత్యంత ఖరీదైన ఐఫోన్లు కూడా ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. 2014 ముందు నాటి పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం దేశ ముఖచిత్రం పూర్తిగా మారిపోయిందని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పటిలా దేశంలో ఇప్పుడు ఎక్కడా విద్యుత్ కోతలు లేవని చెప్పారు. విమానాశ్రయాలు, మెడికల్ కాలేజీలు, ఉత్పాదక రంగం గత పదేళ్లలో భారీగా విస్తరించాయని ఆయన ఉద్ఘాటించారు. దేశం ఇంతటి ప్రగతిపథంలో దూసుకుపోతుంటే విపక్షాలు మాత్రం పనిగట్టుకుని అవాస్తవాలు ప్రచారం చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

రాబోయే 8 నెలలు కీలకం

(మొదటి పేజీ తరువాయి..)

స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాబోయే 8 నెలలు ఎల్ నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో అత్యంత కీలకమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ 8 నెలల పాటు ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఎల్ నినో సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

విద్యుత్ పొదుపు అత్యవసరం

రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని సీఎం చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని, అయితే మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదని తెలిపారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ నినో ప్రభావంపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సినిమా, మీడియా మరియు కళాజాతాలతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.

చుక్క నీరు వృథా కావొద్దు

రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనా వేసి, పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని మరియు చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎల్ నినో ప్రభావం మరియు వర్షాభావ పరిస్థితులపై మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు సీఎం వెల్లడించారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మరియు ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు.

కేంద్రానికి విజ్ఞప్తి.. అదనపు పనిదినాలు

రాష్ట్రంలో దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని మరియు రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరిందని ఆయన గుర్తుచేశారు. వీబీ-జీ రామ్ జీ పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దసరా తర్వాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు.

వార్ రూమ్ ఏర్పాటు.. సీఎంవో పర్యవేక్షణ

ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించేందుకు వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని మరియు ప్రజల కోసం టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాను సీఎంవో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కన్నీళ్లు తుడిచిన కేటీఆర్!

- **మానుకోట ఉద్యమకారుడు జనార్ధన్ మృతి**
- **పెద్దముప్పారంలో రోడ్డునపడ్డ నిరుపేద కుటుంబం**
- **ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**
- **ఆడబిడ్డల భవిష్యత్తుకు రూ.10 లక్షల ఆర్థిక సాయం**

దంతాలపల్లి, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): తెలంగాణ ఉద్యమంలో.. అందులోనూ మానుకోట సంఘటనలో వీరోచితంగా పోరాడిన ఆ ఉద్యమకారుడు కటిక పేదరికంలో మగ్గిపోయాడు. రోజువారీ కూలీగా పనిచేస్తూ ముగ్గురు ఆడబిడ్డలను సాకుతున్న ఆ తండ్రిని అనారోగ్యం బలితీసుకుంది. దిక్కుతోచని స్థితిలో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న ఆ కుటుంబానికి ఓ ఫోన్ కాల్ కొండంత ధైర్యాన్నిచ్చింది. 'నేనున్నాను' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ కుటుంబానికి పెద్దదిక్కై నిలిచారు. ఉద్యమకారుల కష్టాలను పార్టీ ఎన్నటికీ విస్మరించదని చేతల్లో నిరూపించారు. దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన ఈదురు జనార్ధన్ చురుకైన తెలంగాణ ఉద్యమకారుడు. అనారోగ్య సమస్యలతో ఆయన ఇటీవల మరణించారు. కేవలం రోజువారీ కూలీ పనుల మీదే ఆధారపడిన జనార్ధన్ మరణంతో ఆయన సతీమణి, ముగ్గురు కుమార్తెలు తీవ్ర కష్టాల్లో పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న కేటీఆర్ వెంటనే స్పందించి ఆ కుటుంబ సభ్యులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. వారిని ఆత్మీయంగా పరామర్శించి అధైర్యపడొద్దని ఓదార్చారు. జనార్ధన్ ముగ్గురు కుమార్తెల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ఒక్కొక్కరి పేరిట రూ.3 లక్షల చొప్పున మొత్తం రూ.9 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు అందించేలా తక్షణ చర్యలు తీసుకున్నారు.

భార్యకు తక్షణ సాయం.. ఉద్యోగాలపై హామీ

ఆడబిడ్డల పేరిట చేసిన డిపాజిట్లతో పాటు జనార్ధన్ సతీమణి ఈదురు మల్లికకు కుటుంబ ఖర్చుల నిమిత్తం తక్షణ ఆర్థిక సహాయంగా రూ.లక్ష నగదును సైతం అందించారు. భవిష్యత్తులో ఆ ముగ్గురు ఆడబిడ్డలకు ఉద్యోగాల కల్పన విషయంలో పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ నాయకులు స్వయంగా పెద్దముప్పారం చేరుకుని జనార్ధన్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దివంగత ఉద్యమకారుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నేతలు కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్ అందించిన ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి వారికి ధైర్యం చెప్పారు. ఆ తర్వాత నేతలంతా కలిసి బాధిత కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రులు రెడ్యా నాయక్, సత్యవతి రాథోడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి తదితర పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల త్యాగాలను తాము ఎప్పటికీ గుర్తుంచుకుంటామని స్పష్టం చేశారు. వారి కుటుంబాలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం బీఆర్ఎస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. సరిగ్గా అవసరమైన సమయంలో కేటీఆర్ స్పందించి ఆర్థిక సహాయం అందించడం ద్వారా జనార్ధన్ ముగ్గురు కుమార్తెల భవిష్యత్తుకు గొప్ప భరోసా కల్పించారని నేతలు ప్రశంసించారు.

ఎంఎస్ఎంఈలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

- **'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తాం**
- **నెలకోసారి ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే ఏర్పాటు**
- **సృజనాత్మక ఆలోచనలతో ముందుకొచ్చే వారికి సర్కారు అండ**
- **ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): "రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) మరింత బలోపేతం చేసేందుకు త్వరలో ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయబోతున్నాం. ఈ కేంద్రం ద్వారా 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ విశ్వవ్యాప్తమయ్యేలా చూస్తాం. పారిశ్రామిక అభివృద్ధితో పాటు సమాజానికి ఉపయోగపడే సృజనాత్మక ఆలోచనలతో ముందుకొచ్చే ప్రతి ఒక్కరినీ మా ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుంది.." అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. శనివారం బంజారాహిల్స్‌లో నిర్వహించిన వేర్వేరు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. లఘు ఉద్యోగ్ భారతి (తెలంగాణ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లో శనివారం నిర్వహించిన ఎల్‌యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఎంఎస్ఎంఈలు లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తూ పారిశ్రామికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకొచ్చిన ఘనత తెలంగాణకే దక్కిందని ఆయన గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో పరిశ్రమల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి ఆచరణాత్మక పరిష్కారాలు చూపించేందుకు నెలకోసారి ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు.

అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం

హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లోని పారిశ్రామికవాడల అభివృద్ధికి వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ ఎంఎస్ఎంఈ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యత, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై నిర్వాహకులు ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. సమ్మిట్ కార్యక్రమంలో ఎస్బీఐ ఎండీ రామ్మోహన్ రావు, లఘు ఉద్యోగ్ భారతి ప్రతినిధులు వై.వెంకటేశ్వర్లు, కె.నరేంద్రనాథ్ దత్, ఓం అనూజ్ ఖదేల్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు సర్కారు అండ

అనంతరం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో 'కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్', ప్రముఖ నేపథ్య గాయకుడు నేమాని పార్థు ఆధ్వర్యంలో రూపొందించిన 'భాగవతామృతం' (దృశ్య-శ్రవణ పద్యకథా మాలిక) మొదటి సంచికను మంత్రి శ్రీధర్‌బాబు లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ సమాజంలో నైతిక విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, పురాణాలు, ఇతిహాసాలపై యువతలో అవగాహన తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ప్రతి ఇంట్లో భాగవతామృతం

భాగవతంలోని పద్యాలు, వాటి అంతరార్థాన్ని పిల్లలు, యువతకు సులభంగా అర్థమయ్యేలా ఆహ్లాదకరమైన సంగీతం, ఆకట్టుకునే దృశ్యరూపకంతో 'భాగవతామృతం' పేరిట అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమని మంత్రి కొనియాడారు. విజ్ఞానంతో పాటు విలువలనూ పెంపొందించే ఇలాంటి సృజనాత్మక ప్రయోగాలు భవిష్యత్తులో మరిన్ని రావాలని ఆయన ఆకాంక్షించారు. భాగవతాన్ని ప్రతి ఇంట్లో వినపడేలా చేసేందుకు కృషి చేసిన కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ నిర్వాహకులను, గాయకుడు నేమాని పార్థును మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో గనుల శాఖ ప్రత్యేక అధికారి బీఆర్వీ సుశీల్ కుమార్, భోగరాజు మూర్తి, పార్థు నేమాని పాల్గొన్నారు.

అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు

- రవీంద్రభారతి, పబ్లిక్ గార్డెన్‌లో ఎంగిలిపూల వేడుకలు
- పాల్గొన్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్
- మహిళలతో కలిసి ఆడిపాడిన అమాత్యులు
- ప్రత్యేక బతుకమ్మ పాటలను ఆవిష్కరించిన పర్యాటక శాఖ

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): తెలంగాణ సంస్కృతి మరియు సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి మరియు పబ్లిక్ గార్డెన్‌లోని లలిత కళా తోరణంలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు వందలాది మంది మహిళలు తరలివచ్చారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మరియు సంప్రదాయ పాటలు పాడుతూ వారు అత్యంత ఉత్సాహంగా ఆడిపాడారు. మహిళల బతుకమ్మ పాటలతో రవీంద్రభారతి ప్రాంగణం మార్మోగింది. ఈ ప్రారంభ వేడుకలకు రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు మరియు పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ప్రత్యేక పాటల ఆవిష్కరణ

పబ్లిక్ గార్డెన్‌లోని లలిత కళా తోరణంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో సైతం మంత్రులు జూపల్లి కృష్ణారావు మరియు పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ సమర్పణలో ప్రత్యేకంగా రూపొందించిన బతుకమ్మ పాటలను మంత్రులు లాంఛనంగా ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతి మరియు సంప్రదాయాల వైభవాన్ని ఘనంగా చాటిచెప్పేలా ఈ పాటలను తీర్చిదిద్దారు. ఈ వేడుకల్లో మంత్రులు మాట్లాడుతూ ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఐక్యతకు నిదర్శనం..

ప్రకృతి ప్రసాదించిన పూలను దేవతగా కొలిచే అపురూపమైన పండుగ బతుకమ్మ అని మంత్రులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సామూహిక జీవన విధానానికి మరియు కష్టసుఖాలను కలిసి పంచుకునే ఐక్యతా భావానికి ఈ పండుగ నిదర్శనమని వారు అన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని, ప్రతి ఒక్కరూ ఆనందంగా మరియు ఆరోగ్యంగా ఉండాలని మంత్రులు ఆకాంక్షించారు. తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలని మరియు మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్‌తో పాటు పలువురు కార్పొరేషన్ చైర్ పర్సన్లు మరియు పలువురు అధికారులు పాల్గొన్నారు.

విదేశాల్లో జరుపుకోవడం గర్వకారణం

తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత మరియు ఉత్సాహం మధ్య ఈ వేడుకలు కొనసాగాయి. పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి మరియు సంప్రదాయ దుస్తుల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను దేశ సరిహద్దులు దాటి విదేశాల్లోనూ ఘనంగా నిర్వహించడం పట్ల మంత్రి సీతక్క సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆడబిడ్డలు ఎక్కడ ఉన్నా తమ మూలాలను మరియు సంస్కృతి సంప్రదాయాలను మరువకుండా బతుకమ్మ వంటి పండుగలను జరుపుకోవడం ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా సీతక్క అన్నారు. ఇలాంటి వేడుకలు ప్రవాస తెలంగాణ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు మరియు భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడానికి దోహదపడతాయని ఆమె అన్నారు. ఈ వేడుకల్లో మంత్రి సీతక్క వెంట వ్యవసాయ కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి మరియు సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రవాస తెలంగాణ మహిళలు మరియు ఇతర సభ్యులు విశేషంగా పాల్గొన్నారు.

దక్షిణాఫ్రికాలో సీతక్క సందడి

మరోవైపు ఖండాంతరాలు దాటిన తెలంగాణ బతుకమ్మ దక్షిణాఫ్రికాలోనూ వైభవంగా జరిగింది. సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోహాన్నెస్‌బర్గ్ నగరంలో శనివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలతో కలిసి ఆమె బతుకమ్మ ఆడి మరియు పాడారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు మరియు ఆటలతో ఆ ప్రాంగణమంతా సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విదేశీ గడ్డపై సైతం ఘనంగా చాటుతున్న ప్రవాస తెలంగాణ మహిళలతో కలిసి మంత్రి సీతక్క బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు.

కాంగ్రెస్ ఆరోపణలు పచ్చి అబద్ధం!

- ఓటర్ల జాబితా సవరణపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- పార్టీ శ్రేణులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): "ఎన్నికల్లో వరుస ఓటములతో భయపడుతున్న కాంగ్రెస్ నేతలు రాజ్యాంగ సంస్థలపై బురదజల్లుతున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో పచ్చి అబద్ధాలు ఆడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. చేతిలో కనీసం ఒక్క ఆధారం లేకపోయినా ఓట్ చోరీ జరిగిందంటూ రాష్ట్రపతి పేరును సైతం వాడుకుని దిగజారుడు రాజకీయాలకు తెరలేపారు. ఈ దుష్ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలి.." అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆల్ సెల్స్ కన్వీనర్లు, ముఖ్య నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా బోగస్ ఓట్లను తొలగించి పారదర్శకంగా జాబితాను రూపొందిస్తే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఓట్ చోరీ నాటకాలను ఎండగడుతూ స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల ప్రజాస్వామ్యానికి చేకూరే ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పచ్చి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర చేస్తోందని, ఎస్ఐఆర్‌పై వాళ్లు సాగిస్తున్న దుష్ప్రచారానికి హద్దు అదుపు లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న కాంగ్రెస్ ప్రతినిధి బృందం రాష్ట్రపతిని కలిసిన తర్వాత రాహుల్ గాంధీ మీడియా ముందు ఇంకో కొత్త నాటకానికి తెరలేపారని రామచందర్ రావు ఎద్దేవా చేశారు. తాము చేసిన ఆరోపణలకు రాష్ట్రపతి ఆధారాలు అడిగారని చెబుతూనే కనీసం ఒక్క ఆధారం కూడా చూపించకుండా చివరకు రాష్ట్రపతి ఓటు చోరీని ఒప్పుకున్నారంటూ ప్రచారం మొదలుపెట్టారని దుయ్యబట్టారు. ఆధారాలు చూపించలేక అబద్ధాలను అంటగట్టడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

4-5 నెలల సుదీర్ఘ ప్రక్రియ

సెకండ్ ఫేజ్ ఎస్ఐఆర్ అనేది 4-5 నెలలపాటు సాగే సుదీర్ఘమైన ప్రక్రియ అని ఆయన వివరించారు. మొదట బూత్ లెవల్ అధికారులు స్వయంగా ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు పరిశీలించి చనిపోయిన, వలస వెళ్లినవారి పేర్లను తనిఖీ చేసిన తర్వాతే ముసాయిదా లిస్ట్ ఇస్తారన్నారు. ఆ తర్వాత సమ్మరీ లిస్టుపై ఎవరికైనా అభ్యంతరాలుంటే టైప్, ప్రింట్ లేదా చేత్తో రాసి కూడా ఫారమ్-7 అందజేయవచ్చని సూచించారు. దీనిపై ఈఆర్‌వో స్థాయి అధికారి పూర్తి విచారణ చేస్తారని స్పష్టం చేశారు. అన్ని పార్టీల బీఎల్ఏలకు నోటీసులు ఇచ్చిన తర్వాతే పేర్ల తొలగింపులు జరుగుతాయని వెల్లడించారు. ఒకవేళ తొలగింపు తర్వాత కూడా ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేసి క్లెయిమ్ చేసుకుంటే మళ్లీ పేరును చేర్చడానికి కూడా స్పష్టమైన పద్ధతి ఉందన్నారు. ఇంత పకడ్బందీగా జరిగే ఎస్ఐఆర్‌లో ఏకపక్షంగా పేరు తొలగింపు ఉండదన్నారు. ఇప్పటివరకు ఒక్కరైనా ముందుకొచ్చి తమ పేరు డిలీట్ అయిందని చూపించారా అని ఆయన ప్రశ్నించారు. ఏ ఆధారం లేనప్పుడు అసలు ఓట్ చోరీ ఎక్కడ జరిగినట్లు కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.

ఎమర్జెన్సీ కంటే ఘోరం!

మోడీ సర్కారు తీరుపై వి.హనుమంతరావు ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): "కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎమర్జెన్సీ కంటే ఘోరంగా పాలన సాగిస్తోంది. ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టు చేస్తూ నియంతలా వ్యవహరిస్తోంది. నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకు కుట్రలు పన్నుతూ అనేక నాటకాలు ఆడుతోంది.." అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు (వీహెచ్) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో గత 4 రోజులుగా రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలంటూ ఆందోళనలు జరుగుతున్నాయని వీహెచ్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఏకంగా 13 కోట్ల ఓట్లను అక్రమంగా తొలగించారని ఆయన ఆరోపించారు. దీనిపై ఎన్నికల కమిషనర్‌ను కలిసేందుకు ప్రయత్నించినా కనీసం అవకాశం కల్పించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నవారి ఓట్లను ఉద్దేశపూర్వకంగానే తొలగిస్తున్నారని ఆయన విమర్శించారు. ఓట్ల తొలగింపుపై ప్రశ్నించిన వారిని అకారణంగా అరెస్టు చేస్తున్నారని వీహెచ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ రోడ్లపైకి వచ్చి వీరోచితంగా పోరాడుతున్నారని కొనియాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగుతున్న ఈ పోరాటానికి ప్రజలంతా పూర్తి మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేయాలని వీహెచ్ కోరారు. ఆనాడు ఎన్టీఆర్ బీసీల అభ్యున్నతి కోసం పనిచేస్తే చంద్రబాబు మాత్రం వారికి తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కేవలం చంద్రబాబు పార్టీ మద్దతుతోనే కొనసాగుతోందన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో 100 రోజుల పాటు బీసీ ఉద్యమం కొనసాగుతుందని వీహెచ్ ప్రకటించారు. రాష్ట్రం నుంచి మొదలయ్యే ఈ ఓబీసీ ఉద్యమాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్ తరాల కోసం బీసీలు త్యాగాలకైనా సిద్ధపడి తమ హక్కులైన రిజర్వేషన్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ వేదికగా ఆందోళనలు చేపట్టి మోడీ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు.



నువ్వు బతికే ఉన్నావా..

పురుగుల మందు తాగి చావలేదా?'

బాధితుడైన రైతుపై గజ్వేల్ తహసీల్దార్ అనుచిత వ్యాఖ్యలు!

రైతు గోడు వినాల్సిన అధికారి.. చావు మాటలతో వెటకారం!

భూ సమస్య పరిష్కారం కోసం తిరుగుతున్న అన్నదాతకు అవమానం

గజ్వేల్ తహసీల్దార్ తీరుపై తీవ్ర విమర్శలు

గజ్వేల్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): భూమి సమస్యతో బాధపడుతున్న రైతుకు న్యాయం చేయాల్సిన రెవెన్యూ అధికారి.. అతడి ఆవేదనను పట్టించుకోకుండా చావు మాటలతో వెటకారం చేశారన్న ఆరోపణలు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కలకలం రేపుతున్నాయి. తన భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతుతో గజ్వేల్ తహసీల్దార్ అనుచితంగా మాట్లాడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'నువ్వు ఇంకా బతికే ఉన్నావా..? పురుగుల మందు తాగి చావలేదా?' అంటూ రైతును ఉద్దేశించి వ్యాఖ్యానించినట్లు ప్రచారంలో ఉన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న అధికారి ఈ విధంగా మాట్లాడటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూమికి సంబంధించిన సమస్య పరిష్కారం కాకపోవడంతో సదరు రైతు కొంతకాలంగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్న క్రమంలో తహసీల్దార్ నుంచి అనూహ్యమైన వ్యాఖ్యలు ఎదురైనట్లు తెలుస్తోంది. రైతు సమస్యను అడిగి తెలుసుకుని పరిష్కార మార్గం చూపాల్సింది పోయి, అతడి పరిస్థితిని ఎగతాళి చేసేలా మాట్లాడారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే భూ సమస్యతో తీవ్ర ఆవేదన చెందుతున్న రైతుకు అధికారి మాటలు మరింత మనస్తాపం కలిగించినట్లు చెబుతున్నారు. తహసీల్దార్ వ్యాఖ్యలతో తీవ్రంగా కలత చెందిన రైతు 'నా పరిస్థితి చూసి నవ్వుతారా?' అని ప్రశ్నించగా, 'అవును.. వస్తది.. బరాబర్ వస్తది' అంటూ అధికారి వెటకారంగా సమాధానమిచ్చినట్లు వైరల్ వీడియోలో వినిపిస్తోందని ప్రచారం జరుగుతోంది. సమస్యను పరిష్కరించాలని కోరుతున్న రైతుతో ఈ తరహాలో మాట్లాడటం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి కీలకమైన రెవెన్యూ కార్యాలయంలోనే ఇలాంటి పరిస్థితి ఎదురవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనకు సంబంధించినదిగా చెబుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతోంది. తహసీల్దార్ వ్యవహారశైలిపై నెటిజన్లు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ అధికారులు వారి సమస్యలను ఓపికగా విని పరిష్కరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా భూ వివాదాలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు భరోసా కల్పించాల్సిన అధికారులు వారి ఆవేదనను హేళన చేయడం తగదని పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరపాలని రైతు సంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. వైరల్ వీడియోలోని సంభాషణ నిజానిజాలను నిర్ధారించడంతోపాటు రైతు ఎదుర్కొంటున్న భూ సమస్యను కూడా పరిశీలించాలని కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై తహసీల్దార్ వివరణ, ఉన్నతాధికారుల అధికారిక స్పందన ఇంకా తెలియాల్సి ఉంది.

క్రీడాభివృద్ధికి పెద్దపీట

క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, భారీ ప్రోత్సాహకాలు

అంతర్జాతీయ స్థాయికి రాష్ట్ర క్రీడా రంగం

హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియం

గోల్ఫ్ లీగ్ ముగింపు వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): "రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. యువ క్రీడాకారులకు మెరుగైన శిక్షణతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహకాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నాం. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియాన్ని నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారు.." అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, ఎన్డీటీవీ, ఏఎం గ్రీన్, ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ (ఐజీపీఎల్) సంయుక్త ఆధ్వర్యంలో గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్సులో ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించారు. శనివారం జరిగిన ఈ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్ బాల్ క్రీడాకారుడు మెస్సీని తెలంగాణకు ముఖ్యమంత్రి ఆహ్వానించారని భట్టి గుర్తుచేశారు. మెస్సీ ఫుట్ బాల్ ఆడటంతో పాటు హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ప్రకటన కూడా వెలువడిందన్నారు. దక్షిణ కొరియా వంటి దేశాల్లోని విశ్వవిద్యాలయాలు క్రీడల్లో వందలాది పతకాలు సాధిస్తున్న తీరును పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారని తెలిపారు. ఒకే విశ్వవిద్యాలయం వంద పతకాలు సాధించడం వెనుక ఉన్న శిక్షణా విధానాలు, సౌకర్యాలను అధ్యయనం చేయాలని దిశానిర్దేశం చేశారన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే దక్షిణ కొరియాలోని ఆ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి వైస్ ఛాన్సలర్ తో పాటు క్రీడా అధికారులతో చర్చలు జరిపారని వెల్లడించారు. మన విద్యార్థులకు క్రీడా శిక్షణ అందించేందుకు ఆ విశ్వవిద్యాలయంతో ఎంవోయూ కుదుర్చుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ గోల్ఫ్ కోర్సుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, గోల్కొండ కోట వంటి చారిత్రక ప్రాంతానికి సమీపంలో ఈ టోర్నమెంట్ నిర్వహించడం నగరానికి మరింత ప్రాచుర్యం తీసుకొస్తుందని భట్టి పేర్కొన్నారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో కొనసాగుతున్న గోల్ఫ్ కోర్సును క్రీడలు, పర్యాటక రంగాల అభివృద్ధికి ఉపయోగపడే ముఖ్యమైన ప్రాజెక్టుగా ఆయన అభివర్ణించారు. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు పర్యాటక రంగానికి కూడా భారీ ప్రోత్సాహం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఐజీపీఎల్ టోర్నమెంట్‌లో పతకాలు, విజయాలు సాధించిన క్రీడాకారులను భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించి ట్రోఫీలను అందజేశారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో వారు తమ ప్రతిభతో దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఎన్డీటీవీ ప్రతినిధులు, తన మిత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఫహీమ్ ఖురేషి, భాస్కర్ రెడ్డిలు ప్రత్యేకంగా ఆహ్వానించారని చెప్పారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

సంపాదకీయం

రాజకీయ వైరం.. వ్యక్తిత్వ హననం!

ప్రజా సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత దూషణలెందుకు?

కేటీఆర్ అనారోగ్యంపై ఊహాగానాలు.. రాజకీయ విమర్శల పేరుతో ప్రచారం

సీఎం రేవంత్‌రెడ్డిపైనా అనుచిత పోస్టులు, మార్ఫింగ్ చిత్రాల వివాదం

సామాజిక మాధ్యమాల్లో హద్దులు దాటుతున్న రాజకీయ పోరు

తెలంగాణ రాజకీయాల్లో హుందాతనం ఎటుపోతోందన్న ప్రశ్నలు

రాజకీయాల్లో ప్రత్యర్థులంటే శత్రువులేనా..? ప్రభుత్వ విధానాలను విమర్శించాల్సిన చోట వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకోవడం దేనికి సంకేతం..? ప్రజల సమస్యలపై పోరాడాల్సిన రాజకీయ పార్టీలు సామాజిక మాధ్యమాల్లో పరస్పర దూషణలకే ప్రాధాన్యమిస్తున్నాయా..? తెలంగాణ రాజకీయాల్లో ఇటీవల కనిపిస్తున్న కొన్ని పరిణామాలు ఈ ప్రశ్నలను ముందుకు తెస్తున్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య విధానపరమైన విభేదాలు సహజమే అయినప్పటికీ, నాయకుల వ్యక్తిగత జీవితాలు, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకున్న పోస్టులు రాజకీయ చర్చల నాణ్యతపై ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఉద్దేశించి సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో రాజకీయ విమర్శలకు ఉండాల్సిన హద్దులపై చర్చ మొదలైంది.

కేటీఆర్ అనారోగ్యంపైనా రాజకీయ ఊహాగానాలు

తనకు అస్వస్థత, జ్వరం కారణంగా రెండు రోజులపాటు విశ్రాంతి అవసరమని, అందుబాటులో ఉండబోనని కేటీఆర్ సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించినట్లు ప్రచారంలో ఉన్న సమాచారం పేర్కొంటోంది. అయితే ఈ ప్రకటనను కూడా రాజకీయ విమర్శలకు కొందరు ఉపయోగించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అనుకూలంగా భావిస్తున్న కొన్ని సామాజిక మాధ్యమ ఖాతాల్లో ఆయన విశ్రాంతి నిర్ణయానికి రాజకీయ కారణాలను ఆపాదిస్తూ పోస్టులు వెలువడ్డాయని బీఆర్ఎస్ వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. దర్యాప్తు సంస్థల భయంతోనే అనారోగ్యాన్ని కారణంగా చూపుతున్నారంటూ ప్రచారం సాగిందనే ఆరోపణలున్నాయి. అయితే అలాంటి ఊహాగానాలను ధ్రువీకరించే ఆధారాలు వెల్లడికాలేదు. ఒక నాయకుడు తన వ్యక్తిగత పరిస్థితి గురించి చేసిన ప్రకటనను ఆధారాలు లేకుండా రాజకీయ ఆరోపణలకు ముడిపెట్టడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న తలెత్తుతోంది.

ముఖ్యమంత్రిపైనా వ్యక్తిగత దూషణల వివాదం

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని కొన్ని కాంగ్రెస్ వ్యతిరేక సామాజిక మాధ్యమ ఖాతాల నుంచి అనుచిత పోస్టులు వెలువడుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఆయన వ్యక్తిగత జీవితం, కుటుంబ సభ్యులను ప్రస్తావిస్తూ అసభ్యకర వ్యాఖ్యలు, మార్ఫింగ్ చిత్రాలు ప్రచారం చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా చర్చనీయాంశమయ్యాయి. ఇటువంటి ప్రచారంపై సైబర్ నేరాల పోలీసులకు ఫిర్యాదులు అందినట్లు పేర్కొంటున్నప్పటికీ, నిర్దిష్ట కేసుల వివరాలు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. ముఖ్యమంత్రి ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కే అయినప్పటికీ, వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించే ప్రచారం రాజకీయ విమర్శల పరిధిలోకి వస్తుందా అనే అంశంపై చర్చ జరుగుతోంది.

ప్రజా సమస్యల స్థానంలో డిజిటల్ దాడులు?

సామాజిక మాధ్యమాల విస్తరణతో రాజకీయ ప్రచారం వేగం పెరిగింది. యూట్యూబ్, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి వేదికల్లో రాజకీయ పార్టీల అనుకూల, వ్యతిరేక ఖాతాల మధ్య విమర్శలు నిత్యకృత్యంగా మారాయి. అయితే ఎక్కువ మంది దృష్టిని ఆకర్షించేందుకు సంచలనాత్మక శీర్షికలు, వ్యక్తిగత వ్యాఖ్యలు, ధ్రువీకరించని సమాచారాన్ని ఉపయోగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ సరఫరా, నిరుద్యోగం, రైతుల సమస్యలు, భూముల రికార్డులు, ధరణి, హైడ్రా చర్యలు, విద్య, వైద్యం వంటి ప్రజా సమస్యలపై చర్చకు ప్రాధాన్యం తగ్గుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నాయకుల వ్యక్తిగత అంశాలపై జరిగే వాదోపవాదాలు ప్రజా విధానాలపై జరగాల్సిన చర్చలను పక్కదారి పట్టించే ప్రమాదం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

విమర్శకు హద్దు.. వ్యక్తిగత గౌరవానికి రక్షణ

ప్రజాస్వామ్యంలో అధికార పక్షాన్ని ప్రతిపక్షం ప్రశ్నించడం, ప్రతిపక్ష ఆరోపణలకు అధికార పక్షం సమాధానం ఇవ్వడం అవసరం. ప్రభుత్వ నిర్ణయాలు, రాజకీయ నాయ కుల ప్రజా వ్యవహారాలు, అధికార వినియోగంపై కఠినమైన విమర్శలు కూడా ప్రజాస్వా మ్య చర్చలో భాగమే. అయితే ఆధారాలు లేని వ్యక్తిగత ఆరోపణలు, కుటుంబ సభ్యులపై దూషణలు, మార్ఫింగ్ చిత్రాల ద్వారా తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను రాజకీయ విమర్శలతో సమానంగా చూడలేమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే సమయంలో అనుచిత ప్రచారంపై చర్యలు తీసుకునేటప్పుడు చట్టబద్ధమైన విమర్శలు, భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాల్సిన అవసరం కూడా ఉంది. తెలంగాణ రాజకీయ చరిత్రలో ప్రజా ఉద్యమాలు, హక్కుల సాధన, విధానపరమైన పోరాటాలకు ప్రత్యేక స్థా నం ఉంది. ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలంటే రాజకీయ పార్టీలు పరస్పర విమర్శ ల్లో వ్యక్తిగత గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది. అగ్ర నాయకత్వం తమకు అనుకూలంగా పనిచేసే సామాజిక మాధ్యమ విభాగాలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడం, ధ్రువీకరించని ప్రచారాన్ని నిరుత్సాహపరచడం, వ్యక్తిగత దూషణలను బహిరంగంగా ఖండించడం వంటి చర్యలు రాజకీయ చర్చల్లో హుందాతనాన్ని పెంపొందించగలవని పరిశీలకులు పేర్కొంటున్నారు. రాజకీయ ప్రత్యర్థిత్వం విధానాలకే పరిమితం కావాలని, వ్యక్తిగత శత్రుత్వంగా మారకూడదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విమానం దిగకముందే అదుపులోకి..

- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- జంతర్‌మంతర్ నిరసనకు వచ్చిన ముగ్గురు నేతలపై చర్యలు
- విమానంలోకి మహిళా పోలీసులు రావడంపై తీవ్ర అభ్యంతరం
- పోలీసులతో వాగ్వాదం.. సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): నిరసన తెలిపేందుకు దేశ రాజధానికి వస్తే విమానం దిగకముందే అదుపులోకి తీసుకుంటారా..? విమానాశ్రయం బయటకు వెళ్లే అవకాశం కూడా ఇవ్వరా..? ఢిల్లీ విమానాశ్రయంలో చోటుచేసుకున్న పరిణామాలు రాజకీయ చర్చకు దారితీశాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టేందుకు ముంబై నుంచి ఢిల్లీకి చేరుకున్న కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతోపాటు పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా విమానంలో చోటుచేసుకున్న పరిణామాలను అభిజీత్ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో అవి వైరల్‌గా మారాయి.

విమానంలోనే పోలీసులతో వాగ్వాదం

విమానం ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన వెంటనే పోలీసులు లోపలికి వచ్చారని అభిజీత్ దీప్కే ఆరోపించారు. విమానం నుంచి బయటకు వెళ్లకముందే తమను ఎందుకు అదుపులోకి తీసుకుంటున్నారని ప్రశ్నించారు. మహిళా పోలీసు అధికారిణితో మాట్లాడుతూ విమానంలోకి ఎలా వచ్చారని నిలదీశారు. జంతర్‌మంతర్ వద్ద నిరసనకు అనుమతి లేదని పోలీసు అధికారిణి సమాధానం ఇచ్చినట్లు వీడియోలో పేర్కొన్నారు. అనుమతి లేదనే విషయాన్ని విమానాశ్రయం బయటకు వచ్చిన తర్వాత కూడా చెప్పవచ్చు కదా అని అభిజీత్ ప్రశ్నించారు. తమను విమానం నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదని, ఇది నియంతృత్వ ధోరణి అని అభిజీత్ విమర్శించారు. తాము అరెస్టుకు సిద్ధంగానే వచ్చామని వ్యాఖ్యానిస్తూ 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు ముగ్గురు నేతలను విమానాశ్రయంలోని తొమ్మిదో నంబర్ గేటు ద్వారా బస్సులో తీసుకెళ్లినట్లు సీజేపీ విడుదల చేసిన వీడియోల్లో పేర్కొంది.

మా వస్తువులు తీసుకునే అవకాశం ఇవ్వండి

సీజేపీ విడుదల చేసిన మరో వీడియోలో పోలీసులతో నేతలు వాగ్వాదానికి దిగిన దృశ్యాలు కనిపిస్తున్నట్లు పార్టీ తెలిపింది. తమ ఫోన్లు తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ముందుగా వ్యక్తిగత వస్తువులు, బ్యాగులు తీసుకునేందుకు అనుమతించాలని కోరారు. తమపై ఎలాంటి కేసులు పెట్టినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. జంతర్‌మంతర్ నిరసనకు ముందు కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు పన్నెండు అంశాలతో కూడిన మార్గదర్శకాలను విడుదల చేసింది. నిరసన శాంతియుతంగా నిర్వహించాలని, విద్వేషపూరిత వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించింది. ప్రభుత్వ ఆస్తులకు ఎలాంటి నష్టం కలిగించకూడదని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరింది.

జ్ఞానేష్ కుమార్ రాజీనామాకే డిమాండ్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని సీజేపీ ఆరోపిస్తోంది. ఓటరు నమోదు కోసం ఉపయోగించే ఆరో నంబర్ దరఖాస్తు పత్రంలో మార్పులకు సంబంధించి ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలను పక్కన పెట్టారనేది ఆ పార్టీ ఆరోపణ. ఈ అంశాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్‌మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చింది. అయితే ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు స్వతంత్ర నిర్ధారణ లభించలేదు. నేతలను అదుపులోకి తీసుకోవడానికి సంబంధించిన పూర్తి చట్టపరమైన కారణాలు, తదుపరి చర్యలపై ఢిల్లీ పోలీసుల అధికారిక వివరణ తెలియాల్సి ఉంది. నిరసన తెలిపే హక్కు, అనుమతుల నిబంధనలు, పోలీసుల చర్యలపై ఈ ఘటనతో చర్చ మొదలైంది.

ఢిల్లీలో నిరసనల సెగ

మమతా బెనర్జీ, కేజ్రీవాల్, పినరయి విజయన్ అదుపులోకి

అగ్రనేతల అరెస్టులతో ఉద్రిక్తత! ■ జంతర్‌మంతర్ ఆందోళనకు పోలీసుల అనుమతి నిరాకరణ

నోటికి బ్యాండేజ్‌తో మమత వినూత్న నిరసన ■ ప్రతిపక్ష నేతలను బస్సుల్లో తరలించిన పోలీసులు

24 గంటల్లో విడుదల చేయకుంటే నిరాహారదీక్ష చేస్తానన్న వాంగ్‌చుక్

ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామా డిమాండ్‌తో ఆందోళనలు

అదుపులోకి తీసుకోవడాన్ని ప్రతిపక్ష నాయకులు తప్పుబట్టారు.

న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): దేశ రాజధాని ఢిల్లీ నిరసనలతో అట్టుడికింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జంతర్‌మంతర్ వద్ద నిరసనలో పాల్గొనేందుకు ప్రయత్నించిన పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలువురు ప్రతిపక్ష నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలను కూడా నిర్బంధించారు. ఎన్నికల సంఘం తీరుపై ఆందోళనకు దిగిన వారిని పోలీసులు అడ్డుకోవడంతో రాజధానిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

నోటికి బ్యాండేజ్‌తో మమత నిరసన

ఢిల్లీలోని సౌత్ అవెన్యూ ప్రాంతంలో మమతా బెనర్జీని పోలీసులు అడ్డుకున్నారు. ఆమెతోపాటు తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు ఎంపీలను అదుపులోకి తీసుకుని బస్సులో తరలించారు. మమత నోటికి బ్యాండేజ్ అంటించుకుని నిరసన తెలిపారు. తమ గొంతును అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పోలీసుల చర్యలను తప్పుబడుతూ వీడియో సందేశం విడుదల చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ఇండియా కూటమి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

కేజ్రీవాల్ నివాసం వద్ద భారీ బందోబస్తు

ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ నివాసం వద్ద ఉదయం నుంచే పోలీసులు మోహరించారు. జంతర్‌మంతర్ నిరసనలో పాల్గొనేందుకు బయటకు వచ్చిన ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన పలువురు నాయకులను కూడా పోలీసులు నిర్బంధించారు. మరోవైపు పినరయి విజయన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ప్రతిపక్ష నేతలను నిరసన వేదికకు చేరుకోకుండా అడ్డుకోవడంపై ఆయా పార్టీల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

అనుమతి లేదంటున్న పోలీసులు

జంతర్‌మంతర్ వద్ద భారీ నిరసనకు కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునివ్వడంతో ఢిల్లీలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, నిరసనకు అవసరమైన అనుమతులు లేవని పోలీసులు పేర్కొన్నారు. ఈ కారణాలతో ఆందోళనకు అనుమతి నిరాకరించినట్లు తెలిపారు. అయితే శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకోవడాన్ని ప్రతిపక్ష నాయకులు తప్పుబట్టారు.

విడుదల చేయకుంటే నిరాహారదీక్ష

నిరసనకారుల నిర్బంధంపై పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న రాజకీయ నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలను 24 గంటల్లో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరాహారదీక్ష లేదా పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితులను ప్రకటించని అత్యవసర పరిస్థితితో పోలుస్తూ విమర్శించారు.

ఎంతమంది పోలీసులనైనా తెప్పించుకోండి..

వెనక్కి తగ్గేది లేదు!

ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ సవాల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): ఎంతమంది పోలీసులను రంగంలోకి దించినా వెనక్కి తగ్గేది లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల నేపథ్యంలో పోలీసుల చర్యలపై స్పందిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఓ వీడియో సందేశాన్ని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. నాయకులను, యువతను అరెస్టు చేసినంత మాత్రాన తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. గత పది నుంచి పదిహేనేళ్లుగా ప్రధాని మోదీ, ఆరెస్సెస్‌లతో తాను రాజకీయంగా పోరాడుతున్నానని రాహుల్ పేర్కొన్నారు. ఒక ప్రత్యర్థిని పూర్తిగా అర్థం చేసుకున్నట్లే వారి రాజకీయ విధానాలను కూడా తాను అర్థం చేసుకున్నానని వ్యాఖ్యానించారు. నిరసనలను అడ్డుకునేందుకు పోలీసులు ఎంతమందిని మోహరించినా తమ నిర్ణయం మారదని స్పష్టం చేశారు. "మోదీ జీ.. మీకు నచ్చినట్లు చేయండి. పది వేల మంది, ఇరవై వేల మంది, యాభై వేల మంది.. ఎంతమంది పోలీసులనైనా రంగంలోకి దించండి. నాయకులను, యువతను, అందరినీ అరెస్టు చేయండి. అయినా మేము వెనక్కి తగ్గేది లేదు" అని రాహుల్ వ్యాఖ్యానించినట్లు వీడియో సందేశంలో పేర్కొన్నారు. దేశ ప్రజల గొంతుకను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన రాహుల్ గాంధీ, రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత పదిహేనేళ్లలో దేశానికి అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పోరాడతామని అన్నారు. రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని తాము భావిస్తున్న రాజకీయ శక్తులను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎదుర్కొంటామని ప్రకటించారు. కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే వార్తల నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిరసనలకు అనుమతులు, శాంతిభద్రతల అంశాలపై పోలీసుల చర్యలు ఒకవైపు చర్చకు వస్తుండగా, రాజకీయ నిరసనల హక్కుపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

పట్టణానికి నిజమైన హీరోలు పారిశుద్ధ్య కార్మికులే

కార్మికుల మధ్య వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ జన్మదిన వేడుకలు

మున్సిపల్ కార్మికులకు స్వచ్ఛ కేర్ కిట్ల పంపిణీ ■ శాలువాతో సన్మానించి కేక్ తినిపించిన పారిశుద్ధ్య కార్మికులు

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్: ఆసిఫాబాద్ పట్టణాన్ని ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచుతూ నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికులే మన నిజమైన హీరోలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎండి అహ్మద్ పేర్కొన్నారు. వైస్ ఛైర్మన్ ఎండి అహ్మద్ జన్మదినం సందర్భంగా పట్టణ మున్సిపల్ కార్మికులకు స్వచ్ఛ కేర్ కిట్లు, అల్పాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు ఎంతో ఆత్మీయత, అభిమానంతో వైస్ ఛైర్మన్ ఎండి అహ్మద్ చేత కేక్ కట్ చేయించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వైస్ ఛైర్మన్ కి కేక్ తినిపించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తమ శ్రమను గుర్తించి తమ మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం పట్ల కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు.

చైర్మన్ ఛాంబర్‌లో ఘన సన్మానం

అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ , కౌన్సిలర్ల ఆధ్వర్యంలో చైర్మన్ చాంబర్‌లో కేక్ కట్ చేసి శాలువాతో వైస్ ఛైర్మన్ ఎండీ అహ్మద్‌ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడగా తనపై ప్రేమాభిమానాలు చూపి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ కార్మికులకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకాష్, కౌన్సిలర్లు రాపర్తి కార్తీక్, సాలం బీన్ అహ్మద్, బాలకృష్ణ, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, నాయకులు సయ్యద్ నిసార్, దూదల అశోక్, షేక్ సమద్, అనుమండ్ల సాయి, సాయి శ్రావణ్, కొండు సాయి, నిఖిల్, సయ్యద్ జావిద్, జాలింషా, సయ్యద్ అరఫాజ్ అలీ, జాఫర్, సమీర్ ఖాన్, మున్సిపల్ అధికారులు సర్వర్, రామయ్య, వార్డ్ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌కు సన్మానం

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్: ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ జన్మదినం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో ఆయనను అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (ఏపీసీఆర్) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉస్మాన్ ప్రతినిధులతో కలిసి ఆయనను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఆర్ రాష్ట్ర ప్రతినిధులు సలీం, ఏపీసీఆర్ జిల్లా ఇన్‌చార్జి అబ్దుల్ రహమాన్, ఏపీసీఆర్ జిల్లా కోఆర్డినేటర్లు షేక్ జమీల్, సయ్యద్ ఉబేద్ అలీ, ఏపీసీఆర్ ప్రతినిధులు అహ్మద్ బిన్ అబ్దుల్లా, సయ్యద్ అన్సార్, అమర్ బీన్ అహ్మద్, ఎండీ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎండీ అహ్మద్ జన్మదిన వేడుకలను శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆమె తనయుడు కోవ సాయినాథ్ ఎండీ అహ్మద్‌కు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అహ్మద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకాష్, నాయకులు సయ్యద్ నిసార్, షేక్ సమ్మద్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

వైస్ చైర్మన్ అహ్మద్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

క్విట్ ఇండియా ఉద్యమ హీరో జయప్రకాష్ నారాయణ్

నేడు 'లోక్ నాయక్' జన్మదినం

జేపీగా సుప్రసిద్ధులైన జయప్రకాశ్ నారాయణ్ (అక్టోబరు 11, 1902, అక్టోబరు 8, 1979) భారత స్వాతంత్ర్య సమర యోధుడు, రాజకీయ నాయకుడు. సిద్ధాంత కర్త, సోషలిస్ట్ నాయకుడు. ఆయనను "క్విట్ భారతదేశం ఉద్యమం హీరో" అని పిలుస్తారు. 1970 వ దశకంలో అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా ప్రతిపక్షానికి నాయకత్వం వహించి సంపూర్ణ విప్లవానికి పిలుపు నివ్వటం ద్వారా జయప్రకాశ్ నారాయణ్ చిరస్మరణీయు డయ్యాడు. ఆయనను ప్రజలు "లోక్ నాయక్" అని సగౌరవంగా పిలుచు కుంటారు. గత భారత ప్రభుత్వం ఆయన జయంతిని "ప్రజాస్వామ్య పరిరక్షణ దినం"గా ప్రకటించింది. జయప్రకాశ్ నారాయణ్ బెంగాల్ ప్రెసిడెన్సీలోని ఉత్తర ప్రదేశ్‌లోని బలియా జిల్లాకు, బీహారులోని సారన్ జిల్లాకు మధ్యన గల సీతాబ్ది యారా గ్రామంలో 1902 అక్టోబర్ 11న జన్మించాడు. ఉన్నత పాఠశాల విద్యను, కళాశాల విద్యను పాట్నా లో అభ్యసించాడు. అటుపిమ్మట అమెరికాలో 8 సం.లు, వివిధ విశ్వ విద్యాలయా లలో ఉన్నత విద్యనభ్యసించాడు. అమెరికాలో ఉన్న సమయంలో మార్క్స్ సిద్ధాంతాలను అధ్యయనం చేశాడు. ఆ కాలంలోనే యం.యన్.రాయ్ రచనల ప్రభావానికి లోనయ్యాడు. భారత దేశానికి తిరిగి వచ్చిన తరువాత ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (కాంగ్రెస్ పార్టీ) లో చేరాడు. 1920లో జయప్రకాశ్ నారాయణ్ స్వాతంత్ర్య సమర యోధురాలు, కస్తూరిబా గాంధీ అనుచరురాలు అయిన ప్రభావతీ దేవిని వివాహ మాడాడు. అమెరికా నుండి వచ్చిన వెంటనే జవహర్‌లాల్ నెహ్రూ ఆహ్వానం మేరకు ఇండియన్ నేషనల్ కాంగ్రెసులో చేరి త్వరలోనే మహాత్మా గాంధీకి ప్రియ శిష్యుడుగా మారాడు. 1932లో శాసనోల్లంఘన ఉద్య మంలో పాల్గొన్నందుకు భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు 1932లో ఆయనకు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించ బడింది. విడుదలైన తరువాత కాంగ్రెసులో అంతర్భాగంగా కాంగ్రెస్ పార్టీలోని వామపక్ష సమూహంలో, వామపక్ష భావాలతో స్థాపించ బడిన కాంగ్రెసు సోషలిష్టు పార్టీ స్థాపనకు కృషి చేసి, జనరల్ సెక్రటరీగా నియమించ బడ్డాడు. ఈ పార్టీ భారత స్వాతంత్ర్య ప్రచారానికి నాయకత్వం వహించిన సంస్థ. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో సీనియర్ కాంగ్రెసు నేతలంతా అరెష్టు చేయబడిన సమయంలో జయప్రకాశ్ నారాయణ్... రాం మనోహర్ లోహియా, బాసవన్ సింగ్ వంటివారితో కలసి ఉద్యమాన్ని ముందుండి నడిపాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ వైపు పాల్గొనడాన్ని వ్యతిరేకించి నందుకు 1939 లో బ్రిటిష్ వారు మళ్లీ జైలు పాలయ్యారు, కాని తరువాత అతను నాటకీయంగా తప్పించు కున్నాడు. కొంతకాలం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, హింసాత్మక ప్రతిఘటనను, నిర్వహించడానికి ప్రయత్నించి, 1943 లో అరెస్టయి, 1946 లో విడుదలైన తరువాత బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మరింత ఉగ్రవాద విధానాన్ని అవలంబించాలని కాంగ్రెస్ నాయకులను ఒప్పించడానికి ప్రయత్నించారు. స్వాతంత్ర్యా నంతరం జేపీ ఆచార్య నరేంద్ర దేవ్, బాసవన్ సింగ్ మొదలైన వారితో కలసి కాంగ్రెసు నుండి బయటకు వచ్చి తమ సోషలిస్టు పార్టీ ద్వారా ప్రతిపక్ష పాత్ర పోషించారు. 1948లో ఆయన, చాలా మంది కాంగ్రెస్ సోషలిస్టులతో కలిసి కాంగ్రెస్ పార్టీని వీడారు. అలా 1952లో ప్రజా సోషలిస్ట్ పార్టీని ఏర్పాటు చేశారు. అనంతరం బీహారు, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల రాజకీయాలలో ఈ పార్టీ ప్రముఖ పాత్ర పోషించింది. 1954లో జేపీ రాజకీయాల నుండి విరమించుకుని తన జీవితాన్ని ప్రముఖ గాంధేయవాది అయిన ఆచార్య వినోబా భావే యొక్క సర్వోదయ ఉద్యమానికి, దానిలో అంతర్భాగమైన భూదాన్ ఉద్యమానికి అంకితం చేశాడు. తన భూమి నంతా పేద ప్రజలకు ఇచ్చివేసి హజారిబాగ్‌లో ఒక ఆశ్రమాన్ని నెలకొల్పాడు. జేపీ త్వరితగతిన భారతదేశంలో మహాత్మా గాంధీ భావాలకు అనుగుణంగా ఆయన అడుగు జాడలలో నడుస్తున్న సర్వోదయ ఉద్యమ కారులలో కెల్లా ప్రముఖునిగా రూపొందాడు. 1960 వ దశకం చివరిలో జయప్రకాశ్ నారాయణ్ తిరిగి బీహారు రాష్ట్ర రాజకీయాలలో క్రియాశీలంగా వ్యవహరించ నారంభించాడు. 1974 లో నారాయణ్ అకస్మాత్తుగా భారత రాజకీయ రంగంలో ప్రధాని అవినీతి మరియు పెరుగుతున్న అప్రజాస్వామిక ప్రభుత్వంగా తీవ్రంగా విమర్శించారు. బీహారులో జేపీ నాయకత్వం వహించిన ఒక విద్యార్థి ఉద్యమం ఆతర్వాత బీహారు ఉద్యమంగా ప్రసిద్ధి పొందిన ఒక ప్రజా ఉద్యమంగా మారినది. ఈ ఉద్యమ సమయంలోనే శాంతి యుతమైన సంపూర్ణ విప్లవానికి జేపీ పిలుపునిచ్చాడు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన ఆరోపణల క్రింద నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీని దోషిగా పేర్కొంటూ అలహా బాదు హైకోర్టు తీర్పు వెలువడిన వెంటనే జె.పి. ఇందిర రాజీనామాకు డిమాండ్ చేసి, మిలిటరీకి, పోలీసు యంత్రాంగానికి చట్ట విరుద్ధమైన, అనైతికమైన ఆజ్ఞలను పాటించ నవసరం లేదని సూచించాడు. ఈ పరిణామాలు ఇలా జరుగు తుండగానే ఇందిరాగాంధీ 1975 జూన్ 25 అర్ధరాత్రి నుండి దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెనీ) ని విధించింది. జేపీని, ప్రతిపక్ష నేతలను ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆఖరికి కాంగ్రెసు పార్టీలోనే యంగ్ టర్క్‌లుగా పిలువబడుతున్న అసమ్మతి నేతలు కూడా అరెస్టు చేయబడ్డారు.జేపీ ఛండీఘడ్లో డిటెన్యూగా ఉంచబడ్డాడు. బీహారు వరదల సమయంలో అచటి పునరావాస కార్యక్రమాన్ని పర్యవేక్షించుటకు పెరోల్ పై విడుదల కోరినా కూడా ప్రభుత్వం తిరస్కరించింది. ఆఖరికి జె.పి. ఆరోగ్యం క్షీణించడంతో నవంబరు 12 న విడుదల చేయబడ్డాడు. చివరికి ఇందిరా గాంధీ జనవరి 18, 1977న ఎమర్జెన్సీని తొలగించి ఎన్నికలను ప్రకటించడంతో ఆమెను ఎదుర్కోవటానికి కాంగ్రెసుకు వ్యతిరేకంగా జె.పి.మార్గదర్శకత్వంలో జనతా పార్టీ రూపుదిద్దుకున్నది. చివరికి జనతా పార్టీ ఎన్నికలలో కాంగ్రెసును ఓడించి, ఇందిరను గద్దె దింపి, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరచిన మొట్ట మొదటి కాంగ్రెసేతర పార్టీగా చరిత్రలో స్థానం సంపాదించింది. భారతదేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు పోరాడిన లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ అక్టోబరు 8, 1979లో మరణించాడు. మరణానంతరం 1998లో భారత ప్రభుత్వం ఇతనికి దేశంలో అత్యున్నత పురస్కారమైన భారత రత్నను ప్రకటించింది. ఇదిగాక జె.పి. చేసిన ప్రజాసేవకు గుర్తింపుగా 1965లో మెగసెసే అవార్డు ప్రకటించబడింది.

ఆడపిల్లకు అడుగడుగునా అడ్డంకులేనా?

బాలికల హక్కుల పరిరక్షణకు సమాజమంతా కదలాలి

నేడు అంతర్జాతీయ బాలికా దినోత్సవం

విద్య, ఆరోగ్యం, భద్రతలో ఇంకా కొనసాగుతున్న అసమానతలు

బాల్య వివాహాలు, లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేయాలి

ఆడపిల్లను భారంగా కాదు.. భవిష్యత్తుకు బలంగా చూడాలి

చట్టాల అమలుతోపాటు సామాజిక చైతన్యమూ అవసరమే

బాలికల హక్కుల కోసం ప్రత్యేక దినోత్సవం

బాలికలు ఎదుర్కొంటున్న వివక్షను ప్రపంచ దేశాల దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రకటించింది. కెనడా ప్రతిపాదన మేరకు 2011 డిసెంబర్ 19న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం అక్టోబర్ 11ను అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా గుర్తిస్తూ తీర్మానం ఆమోదించింది. దీంతో 2012 అక్టోబర్ 11న తొలిసారిగా ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికల విద్య, ఆరోగ్యం, చట్టపరమైన హక్కులు, సామాజిక సమానత్వం, నాయకత్వ అవకాశాలపై అవగాహన కల్పించడం దీని ప్రధాన లక్ష్యం. మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేసిన ఎలానార్ రూజ్‌వెల్ట్ మహిళా సమానత్వం కోసం చేసిన సేవలు కూడా ఈ సందర్భంగా గుర్తుకు వస్తాయి. మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన రూపకల్పనలో ఆమె కీలక పాత్ర పోషించారు. స్త్రీ, పురుషులందరికీ సమాన గౌరవం, సమాన హక్కులు ఉండాలనే భావనను బలంగా సమర్థించారు.

చదువుకు దూరమవుతున్న బాలికలు

ప్రపంచవ్యాప్తంగా బాలికల విద్య ఇప్పటికీ ప్రధాన సవాలుగానే ఉంది. పేదరికం, కుటుంబ బాధ్యతలు, బాల్య వివాహాలు, పాఠశాలలకు దూరం, రవాణా సౌకర్యాల కొరత వంటి కారణాలతో ఎంతోమంది బాలికలు చదువును మధ్యలోనే వదిలేస్తున్నారు. గతంలో అంతర్జాతీయ సంస్థలు వెల్లడించిన అధ్యయనాలు కోట్లాది మంది బాలికలకు విద్య అందడం లేదని సూచించాయి. బాలికలు అబ్బాయిలతో పోలిస్తే ఇంటి పనులకు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోందని కూడా పరిశోధనలు పేర్కొన్నాయి. భారతదేశంలోనూ బాలికల విద్యకు అనేక అవరోధాలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్నత విద్యకు అవసరమైన వసతులు లేకపోవడం సమస్యగా మారుతోంది. పాఠశాలల్లో ప్రత్యేక మరుగుదొడ్లు, సురక్షిత రవాణా, తగిన మౌలిక సదుపాయాలు లేకపోవడం బాలికల చదువుపై ప్రభావం చూపుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు కూడా వారి భవిష్యత్తును నిర్ణయిస్తున్నాయి. బాలికల ఎదుగుదలకు బాల్య వివాహాలు మరో ప్రధాన అడ్డంకి. చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల చదువు నిలిచిపోవడంతోపాటు ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఆధారపడటం, గృహహింస వంటి ప్రమాదాలు పెరుగుతాయి. బాల్య వివాహాల నివారణకు చట్టాలు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఈ ఆచారం కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ గౌరవం, సంప్రదాయం, ఆర్థిక ఇబ్బందుల పేరుతో బాలికల భవిష్యత్తును బలిపెట్టకూడదనే అవగాహన ప్రతి కుటుంబంలో పెరగాలి. బాల్య వివాహాల నిరోధక చట్టం-2006 ప్రకారం బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండకముందు జరిగే వివాహాలు బాల్య వివాహాల పరిధిలోకి వస్తాయి. చట్టపరమైన చర్యలతోపాటు బాలికలు చదువు కొనసాగించేలా కుటుంబాలకు అవసరమైన సహకారం అందించడం కూడా ముఖ్యమే. బాలికల ఆరోగ్యం, పోషకాహారం విషయంలోనూ అసమానతలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా కౌమారదశలో రక్తహీనత, పోషకాహార లోపం, రుతుస్రావ పరిశుభ్రతపై అవగాహన కొరత వంటి సమస్యలు వారి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. బాలికలకు పౌష్టికాహారం, సకాలంలో వైద్య పరీక్షలు, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలి. కుటుంబంలో అబ్బాయిలకు ఇచ్చే ప్రాధాన్యాన్ని అమ్మాయిలకూ సమానంగా ఇవ్వాలి. చిన్నతనం నుంచే అమ్మాయిలు బలహీనులని, కొన్ని పనులు మాత్రమే చేయగలరని భావించే ధోరణిని మార్చాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బంధువులు బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా వ్యవహరించాలి. చదువు, క్రీడలు, విజ్ఞానం, సాంకేతికత, పరిపాలన సహా అన్ని రంగాల్లో బాలికలు తమ ప్రతిభను చాటుకునేందుకు అవకాశాలు కల్పించాలి. బాలికలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, గృహహింస, అక్రమ రవాణా వంటి నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు మరింత సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి. బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం-2012 అమల్లో ఉంది. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పీసీపీఎన్‌డీటీ చట్టం, బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక చట్టం, వరకట్న నిషేధ చట్టం కూడా ఉన్నాయి. అయితే చట్టాల గురించి అవగాహన లేకపోవడం, ఫిర్యాదు చేయడానికి భయపడటం, సామాజిక ఒత్తిళ్లు వంటి కారణాలతో అనేక సమస్యలు వెలుగులోకి రావడం లేదు.

బాలికలకు తమ హక్కులపై అవగాహన కల్పించడంతోపాటు వేధింపులు ఎదురైనప్పుడు ఎవరిని సంప్రదించాలి, ఎలా ఫిర్యాదు చేయాలి, ఎలాంటి సహాయం పొందవచ్చనే విషయాలను పాఠశాల స్థాయి నుంచే తెలియజేయాలి. బాధితులకు న్యాయం అందించడంలో ఆలస్యం లేకుండా చూడాలి.

పథకాలతోపాటు ఆలోచనా విధానమూ మారాలి

బాలికల విద్య, రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బేటీ బచావో.. బేటీ పడావో' వంటి పథకాలు ఆడపిల్లల సంరక్షణ, విద్యపై అవగాహన పెంపొందించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే ప్రభుత్వ పథకాలు ఒక్కటే సరిపోవు. ప్రతి కుటుంబం ఆడపిల్లను సమానంగా చూడాలి. బాలికలకు చదువు, స్వేచ్ఛ, భద్రత, తమ జీవితంపై నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కల్పించాలి. ఆడపిల్లలను చిన్నచూపు చూసే ధోరణి మారినప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది. బాలికల హక్కుల పరిరక్షణ అనేది కేవలం మహిళా సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత మాత్రమే కాదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలి.

ఆడపిల్లను రక్షించడమంటే ఒక వ్యక్తిని కాపాడటం మాత్రమే కాదు.. ఒక తరం భవిష్యత్తుకు భరోసా ఇవ్వడం. బాలికలకు సమాన అవకాశాలు, గౌరవం, భద్రత కల్పించినప్పుడే అంతర్జాతీయ బాలికా దినోత్సవం అసలైన లక్ష్యం నెరవేరుతుంది.

హ్యాపీ బర్త్‌డే వైస్ చైర్మన్ సాబ్..

ఒక్క ఓవరే కొంపముంచిందా?

రెండో టీ20లో భారత్ ఓటమిపై
గవాస్కర్ విశ్లేషణ

- కుల్దీప్ బదులు మయాంక్, అర్ష్‌దీప్‌లలో ఒకరికి బంతి ఇవ్వాల్సిందని వ్యాఖ్య
- 249 పరుగులు చేసినా దక్కని విజయం
- షాయ్ హోప్ శతకంతో వెస్టిండీస్ సంచలనం
- బౌలింగ్ నిర్ణయమే మ్యాచ్‌ను మలుపు తిప్పిందన్న సన్నీ

రాంచీ, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): భారీ స్కోరు సాధించినా విజయం ఎందుకు దక్కలేదు..? 249 పరుగులు చేసిన భారత జట్టు ప్రత్యర్థిని ఎందుకు నిలువరించలేకపోయింది..? రెండో టీ20లో వెస్టిండీస్ చేతిలో టీమిండియా ఓటమికి కారణమైన కీలక నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మ్యాచ్‌లో ఒక ఓవర్ ఫలితాన్ని మార్చేసిందని అభిప్రాయపడ్డాడు. ఆ సమయంలో కుల్దీప్ యాదవ్‌కు బదులుగా మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్‌లలో ఒకరికి బంతి ఇచ్చి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని పేర్కొన్నాడు. రాంచీ వేదికగా జరిగిన రెండో టీ20లో భారత బ్యాటర్లు చెలరేగడంతో జట్టు 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో టీమిండియా సునాయాసంగా గెలుస్తుందని భావించినప్పటికీ వెస్టిండీస్ బ్యాటర్లు అద్భుతంగా పోరాడారు. ఆరంభంలో మయాంక్ యాదవ్ మూడు కీలక వికెట్లు తీసి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. 36 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టిన అతడు భారత్‌కు ఆశలు కల్పించాడు. అయితే వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అజేయ శతకంతో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచి తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. హోప్‌కు తోడుగా షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 84 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరూ సెంచరీ భాగస్వామ్యంతో భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. రూథర్‌ఫోర్డ్‌ను కుల్దీప్ యాదవ్ అవుట్ చేసినప్పటికీ ఆ తర్వాత అతడికి మరో ఓవర్ ఇవ్వడం మ్యాచ్‌లో కీలక మలుపుగా మారిందని గవాస్కర్ విశ్లేషించాడు. ఆ సమయంలో వేగంగా బౌలింగ్ చేస్తున్న మయాంక్ లేదా అర్ష్‌దీప్‌ను ఉపయోగించి ఉంటే వెస్టిండీస్‌పై ఒత్తిడి కొనసాగించే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డాడు. భారీ స్కోరును కాపాడుకోవడంలో భారత బౌలర్లు విఫలమవడం, కీలక సమయంలో బౌలింగ్ మార్పులు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడం ఓటమికి కారణాలుగా చర్చకు వచ్చాయి. అయితే కుల్దీప్ వేసిన ఒక్క ఓవరే ఓటమికి కారణమని కాకుండా, ఆ సమయంలో తీసుకున్న బౌలింగ్ నిర్ణయాన్ని గవాస్కర్ ప్రధానంగా ప్రశ్నించాడు. భారీ లక్ష్యాన్ని సైతం వెస్టిండీస్ ఛేదించడంతో భారత జట్టు బౌలింగ్ వ్యూహాలపై చర్చ మొదలైంది. 'భారీ స్కోర్ల మ్యాచ్‌లో టర్నింగ్ పాయింట్.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ చేసిన పెద్ద పొరపాటు కుల్దీప్‌తో 17వ ఓవర్ వేయించడం. ఆ ఓవర్లో మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 24 రన్స్ రావడంతో విండీస్ విజయం తేలికైంది. ఆ ఓవర్ గనుక మయాంక్ యాదవ్ లేదా అర్ష్‌దీప్ సింగ్‌లతో వేయించి ఉంటే ఫలితం మరోలా ఉండేది. ఎందుకంటే.. అప్పటివరకూ మయాంక్ ఎకానమీ ఓవర్‌కు 12 ఉంది. అప్పటికీ విండీస్ విజయానికి మరిన్ని రన్స్ కావాలి. 17వ ఓవర్లో మరో వికెట్ లభించి ఉంటే.. మ్యాచ్ టీమిండియా వైపు తిరిగేది. అంతేకాదు 19వ ఓవర్లో శివం దూబేతో బౌలింగ్ చేయించడం సరైన నిర్ణయం కాదు. విండీస్ బ్యాటర్లు భారీ షాట్లు ఆడుతున్నందున అతడి బదులు ఆ ఓవర్ కుల్దీప్ వేయాల్సింది' అని గవాస్కర్ పేర్కొన్నాడు. రాంచీలో థ్రిల్లింగ్ విక్టరీతో సిరీస్‌ను 1-1తో సమం చేసింది పర్యాటక జట్టు. ఐదు టీ20ల సిరీస్‌లో కీలకమైన మూడో మ్యాచ్ అక్టోబర్ 11 ఆదివారం జరుగనుంది.

గురి అదిరింది..
చోళ చీఫ్స్ బోణీ కొట్టింది!

కాకతీయ నైట్స్‌పై 6-2 తేడాతో ఘన విజయం

ఎనిమిది బాణాలతో పది పాయింట్ల గురి కొట్టిన అలెజాండ్రా

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఉద్యమ కెరటం): ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌లో చోళ చీఫ్స్ జట్టు విజయంతో శుభారంభం చేసింది. పీపుల్స్ ప్లాజా వేదికగా శుక్రవారం జరిగిన పోరులో కాకతీయ నైట్స్‌ను 6-2 తేడాతో ఓడించింది. చోళ చీఫ్స్ విజయంలో కొలంబియా ఆర్చర్ అలెజాండ్రా ఉస్కియానో కీలక పాత్ర పోషించింది. లీగ్‌లో అరంగేట్రం చేసిన ఆమె ఎనిమిది బాణాలను పర్ఫెక్ట్ పది పాయింట్ల లక్ష్యానికి గురిపెట్టి అద్భుత ప్రదర్శన చేసింది. చివరి సెట్‌లో చోళ చీఫ్స్ 80 పాయింట్లు సాధించగా, కాకతీయ నైట్స్ 79 పాయింట్లతో సరిపెట్టుకుంది. మరో మ్యాచ్‌లో చీరో ఆర్చర్స్ 6-2 తేడాతో రాజ్‌పుతానా రాయల్స్‌ను ఓడించింది. పృథ్వీరాజ్ యోధాస్ కూడా 6-2 తేడాతో మైటీ మరాఠాస్‌పై విజయం సాధించింది. శనివారం జరిగే పోటీల్లో మైటీ మరాఠాస్‌తో చోళ చీఫ్స్, పృథ్వీరాజ్ యోధాస్‌తో చీరో ఆర్చర్స్, రాజ్‌పుతానా రాయల్స్‌తో కాకతీయ నైట్స్ తలపడనున్నాయి.

మ్యాట్ రెన్‌షా సూపర్ సెంచరీ

దర్బన్ టెస్టులో అద్భుతంగా పుంజుకున్న ఆస్ట్రేలియా!

దర్బన్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న కీలకమైన దర్బన్ టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు అద్భుతంగా పుంజుకుంది. సఫారీ పేస్ దళం ఉధృతికి తొలిరోజు ఆటలో కేవలం 84 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన ఆసీస్.. మిడిలార్డర్ బ్యాటర్ మ్యాట్ రెన్‌షా (102 నాటౌట్) అజేయ శతకంతో జట్టును గట్టెక్కించాడు. వివాదాస్పద 'శాండ్‌పేపర్ గేట్' ఘటన తర్వాత దక్షిణాఫ్రికా గడ్డపై తొలి టెస్టు సిరీస్ ఆడుతున్న కంగారూ జట్టు, ఈ మ్యాచ్‌తో పూర్తిగా గాడిలో పడింది. ఓవర్‌నైట్ స్కోర్ 187/6 తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియాకు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (43) నుంచి అద్భుతమైన సహకారం లభించింది. తొలి రోజు ట్రావిస్ హెడ్ (9), మార్నస్ లబూషేన్ (37), స్టీవెన్ స్మిత్ (25), అలెక్స్ క్యారీ (14) వంటి అనుభవజ్ఞులైన బ్యాటర్లు విఫలమైన చోట, రెన్‌షా క్రీజులో నిలదొక్కుకుని సఫారీ బౌలర్లకు ముచ్చెమటలు పట్టించాడు. కెరీర్‌లో రెండో టెస్టు శతకాన్ని నమోదు చేసిన రెన్‌షా బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. భోజన విరామ సమయానికి ఆస్ట్రేలియా జట్టు 8 వికెట్ల నష్టానికి 277 పరుగులు సాధించి పటిష్ట స్థితిలో నిలిచింది. శతక వీరుడు రెన్‌షాకు తోడుగా నాథన్ లియన్ (8 నాటౌట్) క్రీజులో కొనసాగుతున్నాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో వియాన్ మల్డర్ (4/51) నాలుగు వికెట్లతో రాణించాడు.

వయసు పెరిగినా..
తగ్గని విధ్వంసం!

37 బంతుల్లోనే డివిలియర్స్ మెరుపు శతకం

ఆస్ట్రేలియా ఛాంపియన్స్ బౌలర్లకు చుక్కలు

మైదానం నలువైపులా షాట్లతో చెలరేగిన మిస్టర్ 360

క్రికెట్‌కు వీడ్కోలు పలికినా తగ్గని బ్యాటింగ్ జోరు

ఐపీఎల్‌లోకి తిరిగి రావాలంటున్న అభిమానులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): వయసు పెరిగితే ఆటలో పదును తగ్గుతుందా..? క్రికెట్‌కు వీడ్కోలు పలికితే బ్యాట్ మూగబోతుందా..? దక్షిణాఫ్రికా మాజీ విధ్వంసక బ్యాటర్ ఏబీ డివిలియర్స్ మాత్రం తన ఆటతో ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకప్పుడు బౌలర్లకు చుక్కలు చూపించిన మిస్టర్ 360 మరోసారి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ పోటీల్లో ఆస్ట్రేలియా ఛాంపియన్స్‌పై కేవలం 37 బంతుల్లోనే శతకం బాది అభిమానులను అలరించాడు. మైదానం నలువైపులా బంతులను తరలిస్తూ ఆస్ట్రేలియా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తనదైన వినూత్న షాట్లు, భారీ బాదుడుతో పరుగుల వరద పారించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఏళ్లు గడుస్తున్నా తన బ్యాటింగ్‌లో పదును ఏమాత్రం తగ్గలేదని చాటిచెప్పాడు. ఒకప్పుడు ప్రపంచంలోని మేటి బౌలర్లను సైతం తన విధ్వంసక ఆటతో ఇబ్బంది పెట్టిన డివిలియర్స్ మరోసారి పాత రోజులను గుర్తుచేశాడు. డివిలియర్స్ మెరుపు శతకంతో అభిమానులు సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటికీ అదే జోరుతో పరుగులు సాధిస్తున్న అతడు ఐపీఎల్ వేలంలో పేరు నమోదు చేసుకోవాలంటూ కొందరు అభిమానులు కోరుతున్నారు. క్రికెట్‌కు దూరమైనా తనలోని విధ్వంసక బ్యాటర్ ఇంకా సజీవంగానే ఉన్నాడని డివిలియర్స్ ఈ ఇన్నింగ్స్‌తో మరోసారి నిరూపించాడు.

టీమిండియాతో చరిత్రాత్మక సిరీస్..

15 మందితో కూడిన జింబాబ్వే మహిళల జట్టు ప్రకటన!

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త అధ్యాయానికి జింబాబ్వే మహిళల జట్టు సిద్ధమైంది. ఇటీవల వెస్టిండీస్‌పై అద్భుత విజయంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న ఆ జట్టు, మొట్టమొదటి ద్వైపాక్షిక సిరీస్ కోసం భారత్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా అక్టోబర్ 16 నుంచి టీమిండియాతో వైట్‌బాల్ (టీ20, వన్డే) సిరీస్‌లో ఆఫ్రికా జట్టు తలపడనుంది. ఈ నేపథ్యంలో జింబాబ్వే క్రికెట్ బోర్డు శనివారం 15 మందితో కూడిన పటిష్టమైన మహిళల జట్టును ప్రకటించింది. జోసెఫినె కొమో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్‌కు సంయుక్త ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తున్న జింబాబ్వే జట్టుకు, భారతగడ్డపై భారత్‌తో సిరీస్ ఆడటం ఇదే తొలిసారి కావడం విశేషం. అక్టోబర్ 16న తొలి టీ20తో ఈ పర్యటన ప్రారంభంకానుంది. అక్టోబర్ 18న రెండో టీ20, అక్టోబర్ 20న మూడో టీ20 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఆ తర్వాత అక్టోబర్ 23 నుంచి 28వ తేదీ వరకు ఇరు జట్ల మధ్య వన్డే సిరీస్ కొనసాగనుంది. మరోవైపు, ఇటీవలే భారత జట్టు టీమ్ కమాండ్ చేపట్టిన స్టార్ ఓపెనర్ స్మృతి మంధానకు, స్వదేశంలో వైట్‌బాల్ కెప్టెన్‌గా ఇదే తొలి ప్రధాన సిరీస్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

జింబాబ్వే మహిళల జట్టు:

జోసెఫినె కొమో (కెప్టెన్), బిలవ్డ్ బిజా, చిపో ముగేరి-తిరిపనో, కెలిస్ ధలోవు, మిచెల్లే మవుంగా, ఫ్రాన్సిస్కా చిపరే, ఒలిందర్ చారే, కడ్జాయి చిగోర, యశా గ్వాంజుర, నొమవెలొ సిబండా, లొరిన్ ఫిరీ, చియెడ్జ ధురురు, మొడెస్టర్ ముపచిక్వా, తెండాయ్ మకుషా, ప్రానే మేయర్స్.

అలియాస్ రుక్మిణీ ఎవరు?

నితిన్ సినిమాలో బాలీవుడ్ భామ!

టైటిల్ పాత్రలో ఆఫియా సయ్యద్ అంటూ ప్రచారం

డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): అసలు ఆ రుక్మిణీ ఎవరు..? నితిన్ కొత్త సినిమాలో టైటిల్ పాత్ర పోషించబోయే కథానాయిక ఎవరు..? చిత్రబృందం హీరోయిన్ పేరును రహస్యంగా ఉ ంచడంతో సినీ అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. 'భీష్మ' తర్వాత ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయిన హీరో నితిన్ ఈసారి 'అలియాస్ రుక్మిణీ' చిత్రంతో విజయాన్ని అందుకోవాలని చూస్తున్నాడు. 'దండోరా' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను నాని నిర్మాణ సంస్థ యూనానిమస్ ప్రొడక్షన్ సమర్పణలో దీప్తి గంటా నిర్మిస్తున్నారు. డిసెంబర్ 4న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు అక్టోబర్ 9న చిత్రబృందం ప్రకటించింది. అయితే కథానాయిక ఎవరనే విషయాన్ని వెల్లడించకపోవ డంతో రుక్మిణీ పాత్ర చుట్టూ ఆసక్తికరమైన ప్రచా రం మొదలైంది. ఈ చిత్రంలో రుక్మిణీ పాత్రను బాలీవుడ్ నటి ఆఫియా సయ్యద్ పోషించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత సాజిద్ నడియాద్‌వాలా మేనకో డలిగా చెబుతున్న ఆఫియా ఇటీవల 'ప్రేమ్ కీటాను' చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. మలయాళంలో విజయవంతమైన 'ప్రేమలు' చిత్రానికి రీమేక్‌గా తెరకెక్కిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు 'అలియాస్ రుక్మిణీ'లో నితిన్ కృష్ణ అనే పాత్రలో కనిపించనున్నాడు. కథానాయిక పాత్రకు కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందనే ఆసక్తి టైటిల్‌తోనే నెలకొంది. అయితే రుక్మిణీగా ఆఫియా సయ్యద్ నటిస్తున్నారనే ప్రచారంపై చిత్రబృందం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. అక్టోబర్ 13న హీరోయిన్ ఎవరనే విషయాన్ని వెల్లడిస్తామని ప్రకటించింది. దీంతో ప్రచారంలో ఉన్నట్లుగా ఆఫియానే రుక్మిణీగా కనిపించనుందా..? లేక చిత్రబృందం మరో కథానాయికను పరిచయం చేయనుందా..? అనే ఉత్కంఠకు మంగళవారం తెరపడనుంది.

ఒక్కో సినిమాకు రూ.8 కోట్ల పారితోషికమా?

ప్రచారాలపై శ్రీనిధి శెట్టి క్లారిటీ!

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): సినీ ఇండస్ట్రీలో ఒక భారీ విజయాన్ని అందుకున్న తర్వాత నటీనటుల పారితోషికాలపై రకరకాల ఊహాగానాలు, వార్తలు ప్రచారంలోకి రావడం సహజం. ముఖ్యంగా పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తారల రెమ్యునరేషన్లపై అభిమానుల్లో ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలోనే 'కేజీఎఫ్' సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న నటి శ్రీనిధి శెట్టి ఒక్కో సినిమాకు రూ. 7 కోట్ల నుంచి రూ. 8 కోట్ల వరకు పారితోషికం డిమాండ్ చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. తాజాగా ఈ ప్రచారంపై శ్రీనిధి శెట్టి స్పందిస్తూ పూర్తి స్పష్టత ఇచ్చారు. తన పారితోషికంపై వస్తున్న వార్తలను శ్రీనిధి శెట్టి పూర్తిగా ఖండించారు. ఇప్పటివరకు తాను చేసిన సినిమాల సంఖ్యను పరిశీలిస్తే ఇంత భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నాననే ప్రచారం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. కేవలం టైమ్‌పాస్ కోసం కొందరు వ్యాప్తి చేసే పుకార్ల ఆధారంగా ఇలాంటి రూమర్లను నమ్మవద్దని ప్రేక్షకులు, అభిమానులకు సూచించారు. సినిమాలను ఎంపిక చేసుకునే క్రమంలో తాను పారితోషికానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనని, కేవలం డబ్బు సంపాదించడమే తన లక్ష్యమైతే 'కేజీఎఫ్' విజయాన్ని ఆసరాగా చేసుకుని గత కొన్నేళ్లలో 30 నుంచి 40 ప్రాజెక్టులకు అంగీకరించి ఉండేదాన్నని ఆమె తెలిపారు. తన నటనకు ప్రాధాన్యం ఉన్న మంచి కథలు, నాణ్యమైన పాత్రలకే మొదటి ప్రాధాన్యత ఇస్తానని శ్రీనిధి శెట్టి తేల్చిచెప్పారు. సరైన కథ లభిస్తే పారితోషికం విషయంలోనూ చర్చలకు సిద్ధంగా ఉంటానని, ఒక నటిగా ప్రేక్షకుల మనస్సుల్లో చెరగని ముద్ర వేయడమే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన శ్రీనిధి శెట్టి మోడలింగ్ రంగాన నిలిచి 2016లో 'మిస్ సుప్రానేషనల్' కిరీటాన్ని గెలుచుకున్నారు. ఆ తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన 'కేజీఎఫ్' ఫ్రాంచైజీతో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు.

ఇతరుల జీవితాలపై కామెంట్స్ చేయడానికి మీరెవరు?

ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై మృణాల్ ఠాకూర్ ఆగ్రహం!

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఉద్యమ కెరటం): సినీ తారల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు మరియు రూపురేఖలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా పెరిగిపోతున్న ట్రోలింగ్‌పై టాలీవుడ్, బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇటీవల కాలంలో హీరోయిన్లు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్ మరియు ఆన్‌లైన్ విమర్శలను తప్పుబడుతూ, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను గౌరవించాలని హితవు పలికారు. తన తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ అంశంపై ఘాటుగా స్పందించారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా జీవించే హక్కు ఉంటుందని, ఎవరో తెర వెనుక కూర్చుని ఇతరుల వ్యక్తిగత నిర్ణయాలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని మృణాల్ స్పష్టం చేశారు. కత్రినా కైఫ్, కృతి సనన్ వంటి నటీమణులు సినిమా రంగానికి ఎంతో సేవ చేసి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. వారి కష్టాన్ని, విజయాలను విస్మరించి కేవలం చిన్న చిన్న విషయాలపై విమర్శలు గుప్పించడం సరికాదని అన్నారు. సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే జనాలకు పిచ్చి పట్టినట్లుగా అనిపిస్తోందని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకు ప్రముఖ నటి కత్రినా కైఫ్ ఓ వేడుకలో పాల్గొన్న ఫొటోలపై నెటిజన్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు. తల్లి అయిన తర్వాత మహిళల శరీరంలో సహజంగా వచ్చే మార్పులను కూడా కొందరు విమర్శించడంపై సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు, నటి కృతి సనన్ కూడా ఓ నగల ప్రకటనలో ధరించిన దుస్తులపై కొందరు నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ యాడ్ వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో స్పందించిన మృణాల్ ఠాకూర్.. మహిళల శరీరాకృతి, దుస్తులు మరియు వ్యక్తిగత జీవితాలపై కొద్దిమంది సోషల్ మీడియా వేదికగా నిత్యం అసభ్యకరమైన కామెంట్లు చేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఏ రంగంలోనైనా పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఇలాంటి మానసిక వేధింపులను ఎదుర్కొంటున్నారని, ఇకనైనా ఈ సంస్కృతి మారాలని ఆమె హితవు పలికారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

ఉపాధి హామీ కల్పనలో రాష్ట్రంలో జిల్లా ఫస్ట్

- శాశ్వత ఆస్తుల నిర్మాణంలో బెస్ట్
- సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ
- ప్రణాళిక ప్రకారం జిల్లాలో వీబీజీ రామ్ జీ పనులు
- జిల్లాలో జూలై నుంచి ఇప్పటివరకు 4,02,360 పని దినాల కల్పన
- ఉత్తమ పనితీరుపై రాష్ట్ర స్థాయి అధికారుల అభినందన

ఉద్యమ కెరటం, సిరిసిల్ల: వీబీజీ రామ్ జీ కింద ఉపాధిహామీ పనుల కల్పనలో జిల్లా రాష్ట్రంలో ముందు స్థానంలో నిలిచింది. జిల్లా యంత్రాగాన్ని రాష్ట్ర అధికార యంత్రాంగం అభినందించింది. శాశ్వత ఆస్తుల కల్పన.. వనరుల సంరక్షణ పనులు చేయిస్తూ జిల్లా అధికార యంత్రంగా ముందుకు సాగుతోంది.

విస్తృతంగా ఉపాధిహామీ పనులు..

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వికసిత్ భారత్– గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవక మిషన్ (వీబీజీ రామ్ జీ) కార్యక్రమం కింద పనులను విస్తృతంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు ఉపాధి పనులపై జిల్లాలోని ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా పనులు గుర్తించి చేయిస్తున్నారు.

గొర్రెల షెడ్ల నిర్మాణం, కంపోస్టు షెడ్ల నిర్మాణం..

రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 378 పనులు గుర్తించింది. రాష్ట్రంలోని ఆయా జిల్లాలకు అనువైన.. అలాగే కూలీలకు ఉపాధి కల్పించే పనులను అధికార యంత్రాంగం చేపడుతుంది. ప్రతి కూలీకి 125 పని కల్పించేలా ప్రణాళిక ప్రకారం అధికారులు ముందుకు వెళ్తున్నారు. చెరువుల్లో పూడిక తీత, మట్టి రోడ్ల నిర్మాణం, ఫిష్ పాండ్స్, అటవీ భూముల్లో కందకాల నిర్మాణం, మొక్కలు నాటడం, సంరక్షించడం, అటవీ భూముల్లో మొక్కలు నాటడం, పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణం, కంపోస్టు షెడ్ల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పనులు, కమ్యూనిటీ హాళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్య ఇస్తూ ముందుకు వెళ్తున్నారు. పొలాల కాలువల శుభ్రత, సాగునీటి కాలువల మరమ్మతు లాంటి శ్రమ ఆధారిత పనులను గుర్తించి చేయిస్తున్నారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్ ను నియమించి, మొబైల్ ఫోన్ ద్వారా హాజరు నమోదు చేసేలా చర్యలు చేపట్టింది.

మరింత పెంచేందుకు చర్యలు..

జిల్లాలో మొత్తం 260 గ్రామ పంచాయతీలు ఉండగా, మొత్తం 98వేల జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రతిరోజు 32, 148 మంది కూలీలు పనులకు హాజరవు తున్నారు. ఈ సంఖ్యను మరింత పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుం టున్నారు. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు 4,02,360 పని దినాలు కల్పించడం జరిగింది.

తెలంగాణ జలసిరి పనులు..

వాన నీటి సంరక్షణ, భూ గర్భ జలాల వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జలసిరి పథకం కింద పనులు చేయిస్తుంది.జిల్లాలో 210 ఫామ్ పాండ్స్, 1769 మ్యాజిక్ సోక్ పిట్స్, 91 సామూహిక ఇంకుడు గుంతలు, 464 బోర్ వెల్ రీచార్జ్ గుంతల పనులు పురోగతిలో ఉన్నాయి.

రాష్ట్ర స్థాయి అధికారుల అభినందన..

జిల్లాలో ఒక్కో గ్రామ పంచాయతీ నుంచి సగటున 45 మంది కూలీలు ఉపాగి పనులకు హాజరవుతున్నారు. ఈ సంఖ్య రాష్ట్రంలోనే అత్యధికం. ఉపాధి కల్పనలో ముందున్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులను రాష్ట్ర స్థాయి అధికారులు అభినందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధిహామీ కింద వేతనాలకు రూ.12 కోట్ల 90 లక్షలు ఇవ్వగా, మెటీరియల్ కోసం 76 లక్షల రూపాయలు కేటాయించారు. మెటీరియల్ కోసం ఇంకా 7 కోట్ల 37 లక్షల ఖర్చు చేయాల్సి ఉంది.

కూలీలకు పని కల్పించేలా ప్రణాళిక

- గరిమ అగ్రవాల్, జిల్లా కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో వీబీజీ రామ్ జీ కింద కూలీలకు పనులు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశాం. ఇందులో భాగంగా ఇప్పటికే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు తమ ప్రాంతంలో అనువైన పనులు చేయించడంపై శిక్షణ ఇప్పించాం. పనులకు కూలీలు భారీ సంఖ్యలో వస్తున్నారు. రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం చాలా సంతోషం. ఇదే స్పూర్తితో ముందుకు వెళ్తాం.

ప్రమాదాలకు అడ్డాగా మారిన గ్రీన్ఫీల్డ్ హైవే

టైర్ పేలి బోల్తాపడిన ఐచర్ వాహనం
డ్రైవర్తో పాటు పలువురికి స్వల్ప గాయాలు

ఉద్యమ కెరటం, సత్తుపల్లి: ఖమ్మం జిల్లా వేంసూరు మండలం చౌడవరం గ్రామ శివారులో శనివారం మధ్యాహ్నం గ్రీన్ఫీల్డ్ హైవేపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణిస్తున్న ఐచర్ వాహనం టైర్ పేలడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న క్రాష్ బ్యారియర్ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్తో పాటు వాహనంలో ఉన్న పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సత్తుపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గ్రీన్ఫీల్డ్ హైవేపై వరుసగా ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకో వాలని కోరుతున్నారు.

ప్రతి అమావాస్య రంగనాయక స్వామి ఆలయంలో అన్నదానం

ఉద్యమ కెరటం, బెజ్జూర్: మండల కేంద్రంలోని ప్రసిద్ధ రంగనాయక స్వామి దేవాలయంలో ఇకపై ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిం చనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగేడిపల్లి మహేష్ తెలిపారు. బెజ్జూర్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. నేటి అమావాస్య నుంచే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వాసవి సేవాదళ్ కార్యదర్శి సామల కిరణ్ కుమార్, జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు పుల్లూరి సతీష్ కుమార్ మాట్లాడుతూ భక్తులకు అన్నప్రసాదం అందించడం ఎంతో పుణ్యకార్యమని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమం నిరం తరాయంగా కొనసాగేందుకు గ్రామస్తులు, భక్తులు సహకరించాలని కోరారు. అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. భక్తులకు ప్రతి అమావాస్య రోజున అన్నప్రసాదం అందించే ఈ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఇనుప సామాన్ల దొంగ రిమాండ్

- నిందితుడి నుంచి 40 కిలోల ఇనుప సామాన్లు స్వాధీనం

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇనుప సామాన్ల దొంగతనానికి ప్రయత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.2వేల విలువైన 40 కిలోల ఇనుప సామాన్లు, ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గంభీ రావుపేట గ్రామానికి చెందిన నాగారపు దేవేందర్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మెట్ల నిర్మాణం కోసం కొన్ని రోజుల క్రితం ఇనుప సామాన్లను కట్ చేసి తన ఇంటి కాంపౌండ్లో భద్రపర్చాడు. ఈనెల 10న తెల్లవారుజామున సుమారు 5.30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇనుప సామాన్లను దొంగిలించేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో మేల్కొన్న దేవేందర్, ఆయన భార్య బయటకు వచ్చి చూడగా, గంభీరావుపేట గ్రామానికి చెందిన పిట్ల వంశీ ఇనుప సామాన్లను సంచిలో వేసుకొని తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే నిందితుడిని పట్టుకొని కేకలు వేయడంతో సమీపంలోని ఎండీ ఆల్తాఫ్, జంగిడి లక్ష్మీపతి అక్కడికి చేరుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న ఇనుప సామాన్లు, రాడ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు పిట్ల వంశీపై గతంలోనూ గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుత కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా అక్కడి నుంచి రిమాండ్కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ప్రతి అమావాస్య

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ ప్రారంభం

ఉద్యమ కెరటం, బెజ్జూర్: తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగలో భాగంగా శనివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారం భమయ్యాయి. మండల కేంద్రంలోని రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మను పేర్చారు. తొమ్మిది రోజుల పండుగలో తొలి రోజును ఎంగిలిపూల బతుకమ్మగా జరు పుకుంటారు. ప్రకృతిలో లభించే రంగు రంగుల పూలతో బతుకమ్మను అందంగా అలంకరించి, ఆటపాటలతో తొమ్మిది రోజుల పాటు ఆడపడుచులు సంబరాలు చేసుకుంటారు. గౌరమ్మను పూజించి, సుఖసంతోషాలు, పంటలు బాగా పండాలని మహిళలు మొక్కుకున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి కాంగ్రెస్ శ్రేణుల సన్నాహాలు

- ఖమ్మం సన్నాహక సమావేశంలో పాల్గొన్న బట్టి, తుమ్మల, పొంగులేటి

ఉద్యమ కెరటం, ఖమ్మం: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ రామ్మెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శనివారం ఖమ్మంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్తో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి అను సరించాల్సిన కార్యాచరణపై నాయకులు చర్చించారు. కాంగ్రెస్ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సమావేశంలో పిలుపు నిచ్చారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
11 అక్టోబర్ 2026

సూరారం పాండు బస్తీలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

- వైద్య శిబిరంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్ రావుల శేషగిరి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శేఖర్ యాదవ్

ఉద్యమ కెరటం, కుత్బుల్లాపూర్ ప్రతినిధి: సూరారం పాండు బస్తీలోని ఏవీ మోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్, గాజుల రామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జేకే శేఖర్ యాదవ్‌తో కలిసి ఆయన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు నిర్వహించిన శిబిరంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్. వాసు, విజేందర్ రెడ్డి, యాదగిరి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా మహిళ కార్యదర్శిగా పద్దం విజయలక్ష్మి నియామకం

ఉద్యమ కెరటం, దమ్మపేట:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, కొమ్ముగూడెం గ్రామానికి చెందిన పద్దం విజయలక్ష్మి ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా మహిళా కార్యదర్శిగా శనివారం రాష్ట్ర అధ్యక్షులు పూనెం శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా పద్దం విజయలక్ష్మి మాట్లాడుతూ తన జాతి కోసం హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తానని, ఈ అవకాశం కల్పించిన ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొడిమ్యాలలో ఘనంగా ప్రారంభమైన 'బతుకమ్మ సంబురాలు'

ఉద్యమ కెరటం, చొప్పదండి/కొడిమ్యాల :

జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శనివారం ఎంగిలి పూల బతుకమ్మ సంబురాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆడపడుచులు, మహిళలు, చిన్న పిల్లలు తిరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి ఆటపాటలతో అట్టహాసంగా ఎంతో సంబురంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నలు, యువతిలు పాల్గొన్నారు.

దుర్గామాత గ్రాండ్ ఆగమనం ఉత్సవంలో ఎమ్మెల్యే రేవూరి

ఉద్యమ కెరటం, పరకాల ప్రతినిధి :

ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల వద్ద శనివారం నిర్వహించిన దుర్గామాత గ్రాండ్ ఆగమనం ఉత్సవంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు పూర్తికాకుండానే డైవర్షన్

- వాహనదారుల ఇక్కట్లు
- రేజర్ల సమీపంలో హెచ్చరిక బోర్డులు గందరగోళం
- ప్రమాదకరంగా మారిన రాత్రివేళ ప్రయాణం

ఉద్యమ కెరటం, సత్తుపల్లి: సత్తుపల్లి నుంచి విజయవాడకు వెళ్లే ప్రధాన రహదారిపై చేపట్టిన దారి మళ్లింపు వాహన దారులకు ఇబ్బందులు కలిగిస్తోంది. గతంలో సింగరేణి ఓపెన్కాస్ట్ పక్క నుంచి ఉన్న రహదారిని ఇటీవల సత్తుపల్లి పట్టణ శివారు నుంచి రేజర్ల గ్రామం వరకు మళ్లించారు. అయితే ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణ పనులు పూర్తికాకముందే రాకపోకలు ప్రారంభించడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు డైవర్షన్ సక్రమంగా లేకపోవడంతో పాటు, రహదారిపై దుమ్ము, ధూళి అధికంగా లేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా విజయవాడ నుంచి సత్తుపల్లికి వచ్చే మార్గంలో రేజర్ల గ్రామం సమీపంలో సరైన దిశానిర్దేశక, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహన దారులు ఏ మార్గంలో వెళ్లాలో తెలియక గందరగోళానికి గురవుతున్నారు. పగటిపూటే ఇబ్బందులు ఎదురవుతుండగా, రాత్రివేళల్లో రహదారి పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. తగిన హెచ్చరికలు, సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత సింగరేణి, ఆర్అండ్బీ అధికారులు తక్షణమే స్పందించి రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, డైవర్షన్ మార్గాన్ని సక్రమంగా ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన హెచ్చరిక బోర్డులు, రాత్రివేళల్లో కనిపించే సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే దుమ్ము, ధూళి నివారణకు చర్యలు చేపట్టి ప్రయాణాన్ని సురక్షితంగా మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాన్షిరామ్ కలలుగన్న పేదల రాజ్యాన్ని నిర్మిద్దాం

- దళిత్ శక్తి ప్రోగ్రాం రాష్ట్ర కన్వీనర్ అగ్గిమల్ల గణేష్

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: బహుజన రాజ్య నిర్మాత మనువాద గుండెల్లో సింహ స్వప్నంగ మారిన మాన్యశ్రీ కాన్షిరామ్ కలలుగన్న పేదల రాజ్యాన్ని నిర్మించాలని దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర కన్వీనర్ అగ్గిమల్ల గణేష్ మహరాజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో దళిత శక్తి ప్రోగ్రాం, మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షిరామ్ వర్ధంతిని నిర్వహించారు. కాన్షిరామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ లో అట్టడుగు కులాలు అణగారిన వర్గాలను చైతన్యం చేసి పేదల రాజ్యాన్ని నిర్మించారని పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే బాబాసాహెబ్ అంబేద్కర్ కలలగన్న రాజ్యం ఉత్తరప్రదేశ్ లో కాన్షిరామ్ నాయకత్వం నెలకొల్పబడిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనూ మాదిగ జాగృతి సంఘం దళిత శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ఓటు చైతన్యాన్ని చేసి పేదల రాజ్యాన్ని నిర్మించేందుకు సంకల్ప బద్ధులమవుతున్నామని పేర్కొన్నారు. తెలంగాణలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు అణగారిన వర్గాలు ఓటు చైతన్యంలోకి వచ్చి బహుజన రాజ్య నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ బహుజన రాజ్య నిర్మాణం కోసం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్చార్జి రామగిరి అశ్విని, మాదిగ జాగృతి సంఘం ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు అన్నెల అడెల్లు మహారాజ్, మాదిగ జాగృతి సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్మల నగేష్, జిల్లా నాయకులు పెంటపర్తి ఊషన్న, రాచర్ల నారాయణ, దళిత శక్తి ప్రోగ్రాం నాయకులు అగ్గిమల్ల గంగన్న, దర్శనాల అనిల్, అగ్గిమల్ల నవీన్ కుమార్, అన్నెల లక్ష్మణ్, విను కుమార్, సాయి కుమార్, ఉపారపు శ్రీనివాస్, మెరుగు శ్రీధర్, శివకుమార్, దర్శనాల అశోక్ , రామిల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

- మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: నలంద డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొని సందడి చేశారు. పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల నడుమ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ బతుకమ్మ మన తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని, పూలతో బతుకమ్మను పేర్చి, మహిళలంతా ఒక్కచోట చేరి ఆనందోత్సాహాలతో జరుపుకునే ఈ పండుగ మన రాష్ట్ర ప్రత్యేకతను చాటిచెబుతుంది అని అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ ఎంతో కీలకమని పేర్కొన్నారు. యువత, విద్యార్థినులు సాంప్రదాయ పండుగలను ఉత్సాహంగా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. మున్సిపాలిటీ తరఫున బతుకమ్మ సంబరాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రానున్న మున్సిపాలిటీ ముందస్తు అజెండాలో బతుకమ్మ సంబరాల నిర్వహణకు ప్రాధాన్యత కల్పించి, పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించేలా ప్రతిపాదిస్తామని, ప్రజలు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొనేలా మున్సిపాలిటీ తరఫున అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతిఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. నలంద డిగ్రీ కాలేజ్ విద్యార్థినులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నలంద డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ పున్నారావు , లెక్చరర్లు నర్సింగ్ , రవళి , కళాశాల సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా సీపీఎం నిరసన

- సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరులో ఆందోళనలు

ఉద్యమ కెరటం, సత్తుపల్లి: ఢిల్లీలో సీపీఎం జాతీయ కార్యదర్శి ఎంఏ. బేబీ, బృందా కారత్తో పాటు కేంద్ర కమిటీ సభ్యుల అరెస్టులను నిరసిస్తూ ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో శనివారం సీపీఎం, అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సత్తుపల్లి పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద, పెనుబల్లి మండలం వీఎం బంజర్ అంబేద్కర్ సెంటర్లో, వేంసూరు మండలంలో ఆందోళనలు చేపట్టారు. సర్ పేరుతో ఓటర్ల తొలగింపులను నిరసిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీపీఎం చేపట్టిన నిరసనను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పోలీసుల ద్వారా అరెస్టులు చేయించిందని నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని, కేంద్ర ఎన్నికల సంఘం అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, చలమాల విఠల్రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన తెలపడం ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న హక్కులని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలను అక్రమ అరెస్టులతో అణచివేయాలని చూడటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, వారిపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులు, భావప్రకటనా స్వేచ్ఛ పరిరక్షణకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో రైతు సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు, పట్టణ రైతు సంఘం అధ్యక్షుడు మోరంపూడి వెంకటరావు, చావా రమేష్, పెనుబల్లి మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్, రైతు సంఘం మండల కార్యదర్శి చిట్టి మోదుల కృష్ణయ్య, కండె సత్యం, గుడిమెట్ల బాబు, హమాలీ వర్కర్స్ అధ్యక్షుడు మిద్దె స్వామి, ఏ.నాగయ్య, వెంకటేశ్వరరావు, సేవియా, రాములు, చెన్నారావు, కలకోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్క్రాస్ సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలి

ఉద్యమ కెరటం, నేరడిగొండ: ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ ఆదిలాబాద్ జిల్లా శాఖ చైర్మన్గా ఎన్నికైన డాక్టర్ అడే క్రాంతి కుమార్ను పీఆర్టీయూ టీజీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం పీఆర్టీయూ టీజీ జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్ సింగ్, ప్రధాన కార్యదర్శి నర్రా నవీన్ యాదవ్ మాట్లాడుతూ డాక్టర్ అడే క్రాంతి కుమార్ రెడ్క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందించాలని, సమాజ అభివృద్ధికి విశేష కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో ఆదిలాబాద్ జిల్లా రెడ్క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి, ప్రజలకు అండగా నిలవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ముజీబ్, ఆదిలాబాద్ అర్బన్ మండల అధ్యక్షుడు ఆర్.శ్రీరామ్, నేరడిగొండ మండల ప్రధాన కార్యదర్శి అంబారావు, నార్నూర్ మండల అధ్యక్షుడు రాజకుమార్, కార్యవర్గ సభ్యులు గణేష్, పరశురాం, బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సాతనంబర్ సర్పంచ్ రాథోడ్ రమేష్

ఉద్యమ కెరటం, నేరడిగొండ(ఇచ్చోడ): గ్రామ ప్రజలు తమ నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇచ్చోడ మండలంలోని సాతనంబర్ గ్రామ సర్పంచ్ రాథోడ్ రమేష్ అన్నారు. శనివారం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్లతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ వాహనంలోనే వేయాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే మురుగునీటి కాలువలు, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షబ్బీర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మైనార్టీలకు కుట్టు మిషన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే గడ్డం వినోద్

ఉద్యమ కెరటం, తాండూర్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన కుట్టు మిషన్లను తాండూర్ మండలానికి చెందిన 30 మంది మైనార్టీలకు శనివారం బెల్లంపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కుట్టు మిషన్ల ద్వారా లబ్ధిదారులు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండలో ఏఈ లేని విద్యుత్ శాఖ.. చీకట్లోనే మండలం..!

- ఇంచార్జీల పాలనతో రైతులు, ప్రజలకు తప్పని ఇబ్బందులు
- పూర్తిస్థాయి అధికారిని నియమించాలని డిమాండ్

ఉద్యమ కెరటం, నేరడిగొండ: మండలంలో విద్యుత్ శాఖ పరిపాలన గాడి తప్పింది. మండలానికి పూర్తిస్థాయి అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) లేకపోవడంతో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అధికారి లేమితో ప్రజలు, ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రెండు నెలలుగా లాంగ్ లీవ్ లో కొత్త ఏఈ..

బదిలీల్లో భాగంగా నేరడిగొండ మండలానికి నూతన ఏఈ నియమితులయ్యారు. అయితే ఆయన బాధ్యతలు చేపట్టిన నెలరోజుల పాటు సరిగా విధులకు హాజరు కాలేదు. వారంలో ఒకట్రెండు రోజులు అప్పుడప్పుడు వచ్చి వెళ్లడం మినహా మండలంలోని విద్యుత్ సమస్యలపై దృష్టి సారించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ తర్వాత ఒక్కసారిగా రెండు నెలల పాటు లాంగ్ లీవ్ పై వెళ్లిపోయారు. దీంతో కార్యాలయంలో అధికారి కొరత ఏర్పడింది. ఈ పరిస్థితిని గమనించిన జిల్లా ఉన్నతాధికారులు ఇక్కడి నుంచి ఆదిలాబాద్ కు బదిలీ అయిన పాత ఏఈకే తిరిగి నేరడిగొండ మండల ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే ఆ అధికారి ఆదిలాబాద్ లోనే ఉంటూ నేరడిగొండ మండల వ్యవహారాలను ఫోన్ ద్వారానే నడిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం, సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి.

సమస్య వస్తే ఎవరిని అడగాలి..?

మండలంలోని ఏ గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ కాలిపోయినా, విద్యుత్ తీగలు తెగిపోయినా, లోవోల్టేజ్ సమస్య, వ్యవసాయ మోటార్లు కాలిపోయినా, గృహజ్యోతి, కొత్త కనెక్షన్లు, బిల్లుల సమస్యలపై ఎవరిని సంప్రదించాలో తెలియక ప్రజలు తికమక పడుతున్నారు. కార్యాలయానికి వెళితే అధికారి లేరు, ఫోన్ చేస్తే స్పందన లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ లో పంటలకు విద్యుత్ అత్యవసరం. సరైన సమయంలో విద్యుత్ సరఫరా లేక, మరమ్మతులు ఆలస్యమై రైతులు నష్టపోతున్నారు. గ్రామాల్లో చీకట్లోనే రోజులు గడుపుతున్నామని ప్రజలు వాపోతున్నారు. తాత్కాలిక ఇంచార్జి వ్యవస్థతో సమస్యలు పరిష్కారం కావని, వెంటనే నేరడిగొండ మండలానికి పూర్తి బాధ్యత కలిగిన అధికారిని నియమించి, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మండల రైతులు, ప్రజలు జిల్లా కలెక్టర్, విద్యుత్ శాఖ ఎస్ఈని కోరుతున్నారు.

చేయూత పింఛన్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన

ఉద్యమ కెరటం, తాండూర్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల అర్హతలను అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాండూర్ మండలం మాదారం గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి దరఖాస్తుల వివరాలను తనిఖీ చేసి, నిజనిర్ధారణ చేపట్టారు. వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గత నెలలో దరఖాస్తులను స్వీకరించిందని, ఈ నేపథ్యంలో ఇప్పటికే రెండు విడతల్లో అధికారులు పరిశీలన నిర్వహించగా, చివరి విడతలో భాగంగా జిల్లా స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీపీఎం అన్నాజీ, ఏపీఎం రాజకుమార్, తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మాదారం సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే

చేయూత పింఛన్ల ద్వారా అర్హులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచనల మేరకు నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికీ చేయూత పింఛన్లు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదారం ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, రాజీవ్ నగర్ ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, కాంగ్రెస్ నాయకుడు అసంపేల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అరెస్ట్ రాజ్యాంగ విరుద్ధం

- ఎస్ఐఆర్పై బీఆర్ఎస్ మౌనం ఎందుకు..?
- కాంగ్రెస్ మైనార్టీ సెల్ నేతల ప్రశ్న

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: రాహుల్ గాంధీ అరెస్ట్ రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ గంభీరావుపేట మండల మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ యాసీన్ హుస్సేన్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ హాష్మీ, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ నయ్యర్ లు అన్నారు. రాహుల్ గాంధీ అరెస్ట్కు నిరసనగా కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎస్ఐఆర్ అంశంపై వివిధ రాజకీయ పార్టీలు ఏకమై నిరసనలు వ్యక్తం చేస్తున్నాయని, బీఆర్ఎస్ పార్టీ ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును, రాజ్యాంగ విలువలను గౌరవించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై బీఆర్ఎస్ నాయకులు తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ అరెస్ట్పై నిరసన వ్యక్తం చేస్తూ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అజ్మీరా శ్యామ్ నాయక్ జన్మదిన వేడుకలు

ఉద్యమ కెరటం, జైనూర్: ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ జన్మదిన వేడుకలను జైనూర్ మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ రషీద్, డీసీసీ ఎస్సీ విభాగం జిల్లా చైర్మన్ సుద్దాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్ నాయక్ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులతో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజాసేవలో విశేష గుర్తింపు పొందాలని మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి మనోహర్, పవర్గూడ సర్పంచ్ తొడసం రాజేందర్, రాంనాయక్ తండా సర్పంచ్ రాందాస్, బూసిమెట్ట సర్పంచ్ ఉయ్యాల చందు, గౌరీ కొలంగూడ ఉప సర్పంచ్ ఫైసల్, ఆత్మ చైర్మన్ రాథోడ్ రమేష్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పెందర్ ప్రకాష్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు సుదాల ఆనంద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు భూతలే కిరణ్, బీసీ నాయకుడు దండుగుల మహేష్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ అబ్బు, షేక్ రహీమ్, షేక్ ముబారక్, యూత్ కోఆర్డినేటర్ సిద్దు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి శుభాష్, బీఎల్ఏ నర్సింగ్, విక్రమ్, ఖలీల్, ఇంద్రు లక్ష్మణ్ పటేల్, సాధుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.